

పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎంపీ కృష్ణప్రసాద్

శ్రీవిశ్వావసుకు ఘన స్వాగతం

- దేవాలయాల్లో ప్రత్యేక పూజలు
- కలెక్టరేట్‌లో పంచాంగ శ్రవణం



ఉగాది వేడుకను ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి, వేదికపై జేసీ, ఎమ్మెల్యే నరేంద్ర వర్మ



ఉగాది పురస్కారం అందజేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఉగాది పండుగ జిల్లా ప్రజల జీవితాలలో వెలుగునివ్వాలని కలెక్టర్ వెంకటమురళి ఆకాంక్షించారు. ఆదివారం కలెక్టరేట్ ఎదురు ఏపీహెచ్ఆర్‌డీ సమావేశ మందిరంలో ఉగాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తదుపరి వేద పండితులు కలెక్టర్ జె.వెంకటమురళి, జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మలకు ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమానికి హాజరైన వ్యవసాయ కళాశాల, ఆహార విజ్ఞాన సాంకేతికకళాశాల, ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులందరికి ఆశీస్సులు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం, నెలలో 4వ శుక్రవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికకు సుమారు 400 మందికి ఉచిత భోజన వసతి కల్పించామని కలెక్టర్ వివరించారు. కార్యక్రమానికి వచ్చే వారి కోసం కుర్చీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కలెక్టరేట్ ఆవరణంలో 4 షాపులను ఏర్పాటు చేయటానికి చర్యలు తీసుకోవటం జరిగిందన్నారు. ఆ షాపులను సేంద్రియ పద్దతి ద్వారా తయారు చేసిన కూరగాయలను, .ధాన్యాలను, నేతన్నలచే నేతబడిన చీరలు, వస్త్రాలు అమ్మటానికి, ఒక ఏటీఎమ్ సెంటర్ ఏర్పాటు చేయటానికి కేటాయిస్తామన్నారు. వాటిని త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా సంయుక్త కలెక్టర్ కొరకు బంగ్లా నిర్మాణానికి చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు.

ఆక్వా పార్క్ నిర్మాణానికి రూ.88 కోట్లు మంజూరు

దిండిలో ఆక్వాపార్క్‌నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం 88 కోట్లు మంజూరు చేసిందని కలెక్టర్ తెలిపారు. వాటికి పరిపాలన అనుమతులు కూడా పొందామన్నారు. త్వరలో సీఎం చంద్రబాబు నాయుడు భూమిపూజ చేసిన తర్వాత నిర్మాణాలు మొదలుపెడుతామన్నారు. ఈ ఆక్వాపార్క్‌తో ఆక్వా రైతులు వారికి కావాల్సిన సరుకు కోసం ఇతర రాష్ట్రాలకు, దేశాలకు వెళ్ళకుండా పొందవచ్చన్నారు. . నిజాంపట్నం హార్బర్ ఫేస్-2 విస్తరణ పనులు 63 శాతం పూర్తయ్యాయని తెలిపారు. అటవీ శాఖకు సంబంధించిన భూముల విషయంలో కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదన పంపి పరిష్కార మార్గం చూపామన్నారు. జిల్లాలో ఉన్న కృష్ణానది కుడి కాల్వ గట్టు బలోపేతం చేయడానికి, 1540 కోట్ల రూపాయలతో డీపీఆర్ తయారు చేసి ఇచ్చామన్నారు. జిల్లాలో 1016 మంది డయాలసిస్ రోగులు ఉన్నారని తెలిపారు. వారి కోసం చీరాలలో 13 బెడ్‌లతో ఒక డయాలసిస్ కేంద్రం మాత్రమే ఉందని, జిల్లాలో ప్రతి నియోజకవర్గానికి ఒక డయాలసిస్ కేంద్రాన్ని మంజూరు చేయమని సీఎం దృష్టికి తీసుకెళ్ళినట్లు తెలిపారు. జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఆ ప్రమాదాలు ప్రాణాంతకంగా ఉన్నాయని తెలిపారు. వాటి కోసం రెండు ట్రామాకేర్ సెంటర్‌లు కావాలని సీఎంని కోరినట్లు దానికి స్పందించి మంజూరు చేస్తామని సీఎం తెలిపినట్లు కలెక్టర్ చెప్పారు. కుందేరు వాగు అభివృద్ధికి సంబంధించి డీపీఆర్ తయారు చేసి సీఎంకి ఇవ్వటం జరిగిందన్నారు. వాటిపై సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. జిల్లా ప్రజల దాహార్తిని అమృత ధార పథకంతో పూర్తి స్థాయిలో తీరుస్తామని భరోసా ఇచ్చారని తెలిపారు.

- ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ ప్రజలకు, అధికారులకు, చిన్నారులకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. అధికారులు జిల్లా అభివృద్ధి కోసం శ్రమిస్తున్నారన్నారు. జిల్లాని వ్యవసాయం, విద్య, ఆక్వా రంగాలలో బాగా అభివృద్ధి చెందిందని తెలిపారు. ప్రభుత్వానికి బాగా ఆదాయం తెచ్చే రంగం పర్యాటక రంగం అన్నారు. సూర్యలంక బీచ్‌కు క్లీన్ అండ్ శాండ్ బీచ్‌గా ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఈ స్థానాన్ని గుర్తించి కేంద్ర ప్రభుత్వం స్వదేశీ దర్శన్ 2.0 కింద 97 కోట్ల 52 లక్షల రూపాయలు మంజూరు చేసిందన్నారు. ఇది గర్వించతగ్గ విషయమన్నారు. కలెక్టర్ ప్రమేయంతో కేంద్ర ప్రభుత్వానికి పంపించాల్సిన అన్నిప్రతిపాధనలు సకాలంలో పంపటం వలన నిధులు జిల్లాకు మంజూరయ్యాయన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను అభినందించారు. జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ ధాన్యం కొనుగోలులో చూపిన చొరవ, ప్రజలలో ప్రత్యేక స్థానాన్ని పొందారన్నారు. ఇటీవల జరిగిన కలెక్టర్ కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి ద్వారా జిల్లా ఎస్పీ అభినందనలు పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పోతుల సునీత,జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్, ఆర్డీవో గ్లోరియా పాల్గొన్నారు. అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినీలను అభినందించారు. వివిధ రంగాలలోని ప్రముఖులకు ఉగాది పురస్కారాలు అందించారు.



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులతో కలెక్టర్, ఎమ్మెల్యే

నేడు రంజాన్



- మసీదులు ముస్తాబు
- ప్రార్థనలకు విస్తృత ఏర్పాట్లు
- ఈద్గాల వద్ద ప్రత్యేక పోలీసు బందోబస్తు

బాపట్ల, రేపల్లె మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ముస్లింలు అతిపవిత్రంగా భావించే రంజాన్‌పండుగను సోమవారం జరుపుకోనున్నారు. నెలవంక దర్శనంతో గత నెల 2వ తేది నుండి ప్రారంభమైన రంజాన్‌ఉపవాసదీక్షలు తిరిగి నెలవంక దర్శనంతో ముగిశాయి. సమత,మమతల సమ్మేళితానాన్ని చాటిచెప్పే అతిపవిత్రమైన పండుగ రంజాన్ ఈనెలలోనే పవిత్ర ఖురాన్ అవతరించటంతో ముస్లింలు ఈమాసాన్ని ఎంతో పవిత్రంగా భావిస్తారు. నెలరోజుల ఉపవాసాల అనంతరం రంజాన్‌పండుగను జరుపుకోనున్నారు. పండుగ సందర్భంగా బాపట్లజిల్లాలోని మసీదులు, ఈద్గాలు అందంగా ముస్తాబయ్యాయి. బాపట్ల ఇస్లాంపేట,జమేదారుపేట ఈద్గాలతోపాటు 17మసీదులలో సోమవారం రంజాన్ ప్రార్ధనలకు ఏర్పాట్లు చేశారు. రేపల్లె పట్టణంలోని జామియా పెద్ద మసీద్, మదీనా మసీద్, లక్ష్మీటాకీస్‌సెంటర్లోని మర్కస్ మసీద్, పెనుమూడి రోడ్ లోని మదీనా మసీద్ విద్యుత్ దీపాలతో వెలుగులు విరజిమ్ముతున్నాయి.



రేపల్లె : విద్యుత్ దీపాలతో అలంకరించిన జామియా పెద్ద మసీద్

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

చినగంజాం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని ఆవులదొడ్డి కొత్తగొల్లపాలెం గ్రామంలో ఏప్రిల్ 1వ తేదీన జరిగే పేదల సేవలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొననున్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన హెలిప్యాడ్, టీడీపీ కార్యకర్తల సమావేశం, ప్రజావేదిక ప్రాంతాలను, రామాలయం, పార్కింగ్ స్థలాలను, స్టాల్స్‌ను కలెక్టర్ జె.వెంకటమురళి, ఎస్పీ తుషార్ డూడీ ఆదివారం పరిశీలించారు. సీఎం చేతుల మీదగా వితంతు పింఛన్ పొందే బత్తుల జాలమ్మ, దివ్యాంగ పింఛన్ పొందే వడ్లమూడి సుభాషిణి గృహాలకు వెళ్లి వారితో మాట్లాడారు. సుభాషిణి ఇంటికి రంగులు ఎందుకు వేస్తున్నారని ఎంపీడీవో శ్రీనివాసమూర్తిని ప్రశ్నించారు. ఇంటికి నూతనంగా రంగులు వేయొద్దని, ఇల్లు ఎలా ఉందో అలాగే ఉంచండి అని తహసీల్దార్, ఎంపీడీవోలను ఆదేశించారు. కార్యకర్తల సమావేశానికి 500 మందికి మించి పాసులు ఇవ్వరాదని ఆర్డీవో టీ.చంద్రశేఖర్ సూచించారు. పింఛన్ లబ్ధిదారులకు గృహ నిర్మాణ పథకం కింద గృహాలు మంజూరు చేయాలని హౌసింగ్ పీడీకి సూచించారు. అనంతరం అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను యుద్ధప్రాతిపదిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, డ్వామా పీడీ విజయలక్ష్మి, జిల్లా రవాణాశాఖాధికారి పరందామరెడ్డి, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి మాధవనాయుడు, చీరాల డీఎస్పీ మొయిన్, పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



పింఛన్ లబ్ధిదారు తల్లితో మాట్లాడుతున్న కలెక్టర్



పేదరిక నిర్మూలనకు.. ఉక్కు సంకల్పం

- పీ-4పై సర్వత్రా సానుకూల స్పందన
- విజయవంతమైన సభ
- దిశానిర్దేశం చేసిన చంద్రబాబు
- మార్గదర్శకులకు సూచనలు...
- బంగారు కుటుంబాలకు భరోసా
- రెండు కుటుంబాలతో సీఎం ముఖాముఖి



మాట్లాడుతున్న కురగల్లుకు చెందిన కడియం నరహరి కుటుంబ సభ్యులు

మంగళగిరి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): స్వర్ణ ఆంధ్ర - 2047 నాటికి రాష్ట్రంలో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించాలన్న ఆశయాన్ని చేరుకుంటామని పీ-4 సభ ప్రతిజ్ఞ పూనింది. సున్నా పేదరికం లక్ష్యంగా కూటమి ప్రభుత్వం వెలగపూడి సచివాలయం వద్ద ఆదివారం సాయంత్రం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన పీ-4 సభ విజయవంతమైంది. తొలుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి సభా కార్యక్రమాన్ని ఆరంభించారు. ఆ తరువాత పీ-4 పథకానికి సంబంధించిన లోగోను చంద్రబాబు పవన్‌కళ్యాణ్‌తో కలిసి సంయుక్తంగా ఆవిష్కరించారు. అటు తరువాత పీ-4 తాలూకు రాష్ట్రప్రభుత్వం రూపొందించిన పోర్టల్‌ను కూడ చంద్రబాబు రిమోట్‌తో ఆరంభించారు. ఈ సందర్భంగా మార్గదర్శకులుగా ముగ్గురు దిగ్గజ వ్యాపారవేత్తలను, మంగళగిరి, విజయవాడకు చెందిన రెండు పేద కుటుంబాలవారిని బంగారు కుటుంబాలుగా ఎంచుకుని వేదికపైకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ పేదరికం నిర్మూలన లక్ష్యంగా ఇక్కడ తాము ఉక్కు సంకల్పాన్ని తీసుకుంటున్నామని ప్రకటించారు. నా మిత్రుడు పవన్‌కళ్యాణ్, ప్రధాని మోదీ ముగ్గురం కలిసి ఈ లక్ష్యాన్ని సాధించి తీరుతామని ఉద్వేగంగా అన్నారు. రాష్ట్రంలో సున్నా పేదరికం లక్ష్యంగా తనకున్న నిర్ధిష్టమైన ఆలోచనలను ఈ వేదిక సాక్షిగా ప్రజలముందర పెడుతున్నానని చెప్పారు.

- ఈ కార్యక్రమానికి బంగారు కుటుంబాలుగా ఎంచుకున్నవారిలో మొదట మంగళగిరి పాత రూరల్ మండలం కురగల్లుకు చెందిన కడియం నరసింహ, వెంకట సుశీల దంపతులను పరిచయం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు వారితో నేరుగా సంభాషిస్తూ కుటుంబ స్థితిగతులను గురించి విచారించారు. ముఖ్యమంత్రి అడిగిన ప్రశ్నలకు నరసింహ సమాధానమిస్తూ తాను గొర్రెలు కాచుకుని జీవనం సాగిస్తున్నట్లు తెలిపాడు. తనకు భార్య, ఇద్దరు పిల్లలు, వృద్ధులైన తల్లీదండ్రులు ఉన్నారన్నారు. పదవ తరగతి చదువుతున్న తన కుమారుడ్ని సివిల్ ఇంజనీరుగా చూడాలన్న కోరిక తనకు బలంగా ఉందన్నారు. కుమార్తె ఎనిమిదవ తరగతి చదువుతుందన్నారు. నెలకు ఎంత సంపాదిస్తావంటూ సీఎం అడుగగా...తనకు నెలనెలా జీతం రాదని, మూడు మాసాలకు ఓసారి పెంచిన గొర్రెలలో ఒకదానిని అమ్మి రూ 20 వేల వరకు సంపాదిస్తానని తెలిపారు. భార్య వెంకట సుశీల పూల తోటలలో పూలు కోస్తూ రోజుకు రూ వందనుంచి రెండొందల వరకు సంపాదిస్తుందని చెప్పారు. తనకు మెరుగైన ఉపాధికి సాయమందించడంతోపాటు తన బిడ్డలను చదివించాలని నరసింహ అభ్యర్ధించాడు. ఈ సందర్భంగా చంద్రబాబు సూచనల మేరకు మార్గదర్శి గ్రీన్‌గో కంపెనీ యజమాని చలమలశెట్టి అనిల్‌కుమార్ స్పందిస్తూ ఆ కుటుంబానికి తాను అండగా వుంటానని హామీనిచ్చారు. ఇది తనకో గొప్ప అవకాశమని గతంలో సీఎస్ఆర్ కింద కొన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించినప్పటికీ...తనకు సంతృప్తి కలగలేదన్నారు. పీ-4 పేరుతో ఏర్పాటుచేసిన ఈ ప్లాట్‌ఫారం చాల గొప్పదిగా తాను భావిస్తున్నట్టు చెప్పారు.

> చంద్రబాబు మాట్లాడుతూ పీ-4లో తొలిదశగా 30 లక్షల కుటుంబాల వారిని ఆర్థికంగా సామాజికంగా పైకి తీసుకురావాలన్నారు. మార్గదర్శకులు డబ్బులు ఇవ్వడమొక్కటే లక్ష్యంగా పెట్టుకోకుండా తాము బాధ్యత తీసుకున్న కుటుంబాలకు మంచి గైడెన్స్ కూడ ఇవ్వాలన్నారు. వారివారి ఆదాయ పెంపుకు తగిన సలహాలు, సూచనలతోపాటు తగిన అవకాశాలను కూడ కల్పించాలన్నారు. ఈ సందర్భంగా తాను చిన్నతనంలో ఏడు కిలోమీటర్లు నడిచి వెళ్లి చదువుకునే వాడినని, వచ్చిన అవకాశాలను ఉపయోగించుకుంటూ తాను ఈ స్థాయికి వచ్చానని చెప్పారు. అలాగే పేదలకు సాయమందించే విషయంలో ప్రభుత్వాలు ముందుండి పనిచేసినా వారి ఎదుగుదలకు చాల సమయం పడుతుందన్నారు. నిజానికి ఒక జనరేషన్ మిస్ అయ్యేంత సమయం పడుతుందన్నారు. అందుకే తాను బాగా ఆలోచించి పేదరికం నిర్మూలనకు ఈ పీ-4 పథకానికి రూపకల్పన చేశానని చెప్పారు.

- విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం 57వ డివిజన్ నుంచి వచ్చిన మరో బంగారు కుటుంబం తాలూకు యజమాని మత్స్యా ఇమ్మానుయేల్, శారణ్ దంపతులు మాట్లాడుతూ తమ కుటుంబ దీనగాధను సభ ముందుంచారు. ఇమ్మానుయేల్ రాడ్ బెండింగ్ వృత్తిలో వుంటూ కుటుంబపోషణ చేస్తున్నట్టు తెలిపాడు. ఈ కుటుంబ వ్యధ ఆసక్తిగా అనిపించడంతో చంద్రబాబు వారితో ఎక్కువసేపు మాట్లాడారు. ఈ దంపతులకు ఇద్దరు సంతానం వున్నారు. కుమార్తె అలేఖ్య ఇంటర్ ప్రథమ సంవత్సరం బైపీసి చదువుతుండగా...కుమారుడు గని ప్రకాష్ పదవ తరగతి వరకు చదివి ప్రస్తుతం తనకు తోడు రాడ్ బెండింగ్ పనికి వస్తున్నట్టు తండ్రి ఇమ్మానుయేల్ వివరించాడు. కుమారుడ్ని ఎందుకు చదివించడం లేదని చంద్రబాబు అడుగగా...తనకు వచ్చే రూ 700లు కుటుంబ పోషణకు సరిపోనందున కుమారుడ్ని చదువు ఆపించి తనతోపాటు కూలీపనికి తీసుకువెడుతున్నట్టు చెప్పాడు. అలా ఎందుకు చేయాల్సి వచ్చిందని అడుగగా కుమార్తె అలేఖ్యను మెడిసన్ చేయించాలన్న పట్టుదలతో తమ కుటుంబమంతా కలిసి ఆలోచించుకుని ఈ నిర్ణయం తీసుకుందని భార్యాభర్తలు సమాధానమిచ్చారు. కొడుకును చదివించలేక పోతున్నామన్న బాధ నీకు లేదా? అంటూ సీఎం చంద్రబాబు శారణ్‌ను ప్రశ్నించగా ఆమె కళ్లనీళ్లు పెట్టుకున్నారు. మీ తండ్రి మీ అక్కను చదివిస్తూ నిన్ను కూలీపనికి పంపించడం నీకేమీ కోపాన్ని తెప్పించలేదా అంటూ చంద్రబాబు ప్రకాష్‌ను ప్రశ్నించగా అలాంటిదేమీ లేదని తన తండ్రికి సాయం చేస్తున్నానన్న తృప్తి తనకు వుందన్నారు. అలాగే తమ కుటుంబంనుంచి అక్కను డాక్టర్‌ను చేయాలన్న పట్టుదల తమందరికీ ఉందంటూ ప్రకాష్ చెప్పాడు. ఆ వెంటనే నీవు బైపీసి ఎందుకు తీసుకున్నావని చంద్రబాబు అలేఖ్యను అడుగగా తనకు డాక్టర్ కావాలనే కోరిక బలంగా ఉందన్నారు. డాక్టరే కావాలని ఎందుకనుకుంటున్నావని అడుగ్గా తమ పేద కుటుంబాల వారికి ఉచితంగా వైద్యసాయం అందించాలన్న లక్ష్యంతో తాను ఈ నిర్ణయం తీసుకున్నానని అలేఖ్య చంద్రబాబుకు వివరించింది. దీంతో చంద్రబాబు ఆమెను అభినందిస్తూ పేదలలో పుట్టినంత మాత్రాన మంచి ఆశయాలు వుండకూడదన్న రూలేమీ లేదన్నారు. అనంతరం మార్గదర్శిగా జైరాజ్ స్టీల్ కంపెనీ యజమాని సజ్జన కుమార్ గోయంకా స్పందిస్తూ అలేఖ్యను తాను మెడిసన్ చదివించగలనని హామీనిచ్చారు.

- మరో మార్గదర్శి మేఘా ఇంజనీరింగ్ కంపెనీ యజమాని పీవి కృష్ణారెడ్డి మాట్లాడుతూ డిసెంబరు 14న ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ పీ-4 పథకాన్ని గురించి తొలుత ప్రకటించారన్నారు. ఇది కచ్చితంగా ఓ గేమ్ ఛేంజర్‌గా నిలబడుతుందన్నారు. పేదరికాన్ని నిర్మూలించాలన్న కాంక్ష సీఎం చంద్రబాబులో చాల బలంగా ఉందన్నారు. చంద్రబాబు సూచనతో తాను కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు మండలాన్ని దత్తత తీసుకుని దాని సామాజికంగా ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నానని చెప్పారు. తాను వ్యాపారపరంగా 20 దేశాలు, 20 రాష్ట్రాలలో తిరుగుతుంటానని...కానీ ఈ ప్రభుత్వం మాదిరి ప్రజలకు ఏదో మేలు చేయాలన్న తపన ఎక్కడా ఇంత బలంగా కనిపించలేదని చెప్పారు. ఈ సభా కార్యక్రమానికి ప్రముఖ టీవీ యాంకర్ ఝాన్సీ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.



కురగల్లుకు చెందిన కడియం నరహరి కుటుంబ సభ్యులతో ఒకే టేబుల్ వద్ద కూర్చుని ముచ్చటిస్తున్న సీఎం, డిప్యూటీ సీఎం



ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు, వేదికపై డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని



కర్ణాటక నుంచి మిర్చి తెస్తున్న **వ్యాపారస్థులు**

- రైతుల పేర్లతో మిర్చియార్డులో విక్రయం
- రికార్డుల్లో రొటేషన్ అవుతున్న కొందరి పేర్లు
- రైతుల మిర్చిని మాత్రమే కొనుగోలు చేయాలని మంత్రి ఆదేశాలు

స్లాట్ తీసుకుంటేనే రిజిస్ట్రేషన్

రేపు జాతీయ స్థాయి నాటకోత్సవాలు ప్రారంభం

ఎడ్లపోటీల్లో గడివేముల జతకు ప్రథమ స్థానం

ఆదివాసీలపై హింసకు వ్యతిరేకంగా పోరాడాలి

- పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ చంద్రశేఖర్

7

దిక్సూచి
DIKSUCHI

జీపాట్ 2025

గ్రాడ్యుయేట్ ఫార్మసీ ఆప్టిట్యూడ్ టెస్ట్ (జీపాట్) 2025కి సంబంధించిన నోటిఫికేషన్‌ను 'నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్(ఎన్‌బీఈఎమ్ఎస్) విడుదల చేసింది. ఎంఫార్మసీ అడ్మిషన్స్ కోసం ఉద్దేశించిన ఈ కంప్యూటర్ బేస్డ్ ఎంట్రెన్స్ 2025 మే 25న జరుగుతుంది. 2025 ఏప్రిల్ 1వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ విండో ఓపెన్ అవుతుంది. అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు natboard.edu.in లింక్ యాక్టివేట్ అయిన తరవాత దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ తరవాత, నాలుగు సంవత్సరాల ఫార్మసీ విద్య పూర్తిచేసుకున్న అభ్యర్థులు దరఖాస్తునకు అర్హులు. అభ్యర్థులకు ఎలాంటి వయో పరిమితి లేదు. మే 21న హాల్ టికెట్లు విడుదల చేస్తారు. మే 25న పరీక్ష కాగా, ఫలితాలను జూన్ 25న వెల్లడించే అవకాశం ఉంది. జీపాట్ అడ్మిషన్ ప్రొసీజర్ ప్రారంభం కంటే ముందే ఫలితాలు వెల్లడయ్యే అవకాశం ఉంటే బీఫార్మసీ ఫైనల్ ఇయర్ చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు ఫీజు రూ.3500. ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ అభ్యర్థులు రూ.2500. పూర్తి వివరాలకు ఎన్‌బీఈఎమ్ఎస్ వెబ్‌సైట్ చూడవచ్చు.

30 రోజుల్లో నీట్
ఇలా ప్లాన్ చేయండి



నీట్ పరీక్షకు దాదాపుగా ముప్పై రోజుల వ్యవధి ఉంది. ఈ సమయంలో విద్యార్థులకు ప్రణాళికాబద్ధమైన వ్యూహం అవసరం. మొత్తం 180 ప్రశ్నలతో నీట్ యూజీ ఉంటుంది. ఇందులో ఫిజిక్స్ 45, కెమిస్ట్రీ 45, బయాలజీ 90 ఉంటాయనే విషయం తెలిసిందే. ఇందులో సరైన సమాధానానికి 4 నాలుగు మార్కులు లభిస్తాయి. తప్పుగా రాసిన సమాధానానికి ఒక మార్కు మైనస్ చేస్తారు. పరీక్షకు సంబంధించి ఇలా మీదైన సొంత వ్యూహం రూపొందించుకోండి.

- 30 రోజులకు సంబంధించిన షెడ్యూల్‌ను మొదట ప్రిపేర్ చేసుకోండి. మూడు గంటలు ఫిజిక్స్, మూడు గంటలు కెమిస్ట్రీ, మూడు గంటలు బయాలజీకి కేటాయించండి.
- గత పరీక్షల ఆధారంగా అధ్యాయాల వెయిటేజీని విశ్లేషించండి. 2021 నుంచి 2024 వరకు పేపర్ల ట్రెండ్‌ను గమనించండి.
- ఫిజిక్స్, కెమిస్ట్రీ సహా అన్ని సబ్జెక్టుల కాన్సెప్టులను ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల ఆధారంగా నేర్చుకోండి. ప్రతీ చాప్టర్‌కు షార్ట్ నోట్స్ ప్రిపేర్ చేసుకోండి.
- ప్రతీ సబ్జెక్టులోనూ ఎక్కువ వెయిటేజీ ఉన్న చాప్టర్లపై దృష్టి పెట్టండి. అలాగే ప్రతీ విద్యార్థి కొన్ని చాప్టర్లను సులభం అని భావిస్తారు. వాటిపై కూడా తప్పనిసరి దృష్టి సారించాలి.

> సొంతంగా చదువుకునే సమయంలో సందేహం వస్తే టెక్నాలజీపై ఆధారపడండి. అంతేతప్ప సందేహాన్ని తీర్చుకునే విషయంలో వాయిదా అనే మాటే వద్దు. యూట్యూబ్స్, సబ్జెక్ట్ వెబ్‌సైట్స్ ఉపయోగించుకోండి.

- రోజూ ఫిజిక్స్ ఫార్ములాలు రివిజన్ చేయండి. దీనితోపాటు 2021 నుంచి 2024 సంవత్సరాల ప్రశ్నపత్రాలను సాధన చేయండి. రోజుకు ఒక గంట అయినా ఈ పనిచేయాలి.
- ఫిజిక్స్ ప్రాబ్లమ్ సాధించే సమయంలో టైమ్ మేనేజ్‌మెంట్ పాటించండి. ఒక ప్రశ్నను ఒక నిమిషంలో పూర్తి చేసేలా ఉండాలి.
- ఫిజిక్స్‌లో రోజుకు కనీసం 30-40 ప్రశ్నలు పూర్తి చేసేలా చూసుకోండి.
- రోజులో మొదట ఫిజిక్స్ సబ్జెక్టు చదవడానికి ప్రాధాన్యం ఇవ్వండి. ఫ్రెష్ మైండ్‌తో ఎక్కువగా అర్థం అవుతుంది.
- కెమిస్ట్రీ విషయానికి వస్తే ఆర్గానిక్ కెమిస్ట్రీపై పట్టు సాధించండి. మెకానిజమ్స్ ప్రాక్టీస్ చేయండి. ఫ్లోచార్ట్ గుర్తుంచుకోండి.
- కెమిస్ట్రీ ఫార్ములా రివిజన్‌తోపాటు 2019 నుంచి 2024 వరకు ప్రశ్న పత్రాలపై పట్టుసాధించాలి.
- ఫిజికల్ కెమిస్ట్రీలలో బలమైన అంశాలపై దృష్టి సారించండి. ఉదాహరణకు ఇన్‌ఆర్గానిక్ కెమిస్ట్రీలో బలహీనంగా ఉంటే పీ-బ్లాక్ ఎలిమెంట్స్‌కో ఆర్డినేట్ కాంపౌండ్స్‌పై ఎక్కువ సమయం కేటాయించండి.
- బయాలజీ విషయానికి వస్తే ఎన్‌సీఆర్‌టీ పుస్తకాలు చదవండి. జన్యుశాస్త్రం, మానవ శరీర నిర్మాణ శాస్త్రం, బయోటెక్నాలజీ, పర్యావరణ శాస్త్రం మొదలైన వాటికి ఎక్కువ వెయిటేజీ ఉంటుంది.
- మెటీరియల్ చదివే సమయంలో రాసుకున్న షార్ట్‌నోట్స్ రివిజన్ సమయంలో బాగా ఉపయోగపడుతుంది. తరుచూ ఎంట్రెన్స్‌లో వచ్చే చాప్టర్లు ఎక్కువగా రివిజన్ చేయడాలి.
- ముఖ్యమైన డయాగ్రామ్ చదవండి. ప్రతీ డయాగ్రామ్ లేబుల్స్ క్షుణ్ణంగా పరిశీలించండి.
- బయాలజీ స్కోరింగ్ సబ్జెక్టు. అందుకే డిటైల్డ్‌గా చదవడానికి ప్రయత్నించండి.
- వీలయినన్ని మాక్ టెస్ట్‌లు రాయండి. దీంతో ఏయే చాప్టర్లపై పట్టు ఉందో అర్థం అవుతుంది. అలాగే టైమ్ మేనేజ్‌మెంట్ టెక్నిక్ తెలుస్తుంది.
- నా ప్రిపరేషన్ సరిగా లేదేమో లేదా సరిపోలేదేమో అనే భావనకు లోనుకావద్దు. ఆత్మవిశ్వాంతో ఉండండి.



- డా. కిషన్ రావు టంకశాల
సంజీవని మెడికల్ అకాడమి

SCHOLARSHIP ALERT

The Cadence Program



The Cadence Scholarship Program 2025-26 provides financial assistance to Indian nationals pursuing undergraduate and professional courses in select regions (Delhi NCR, Bangalore, Pune, Ahmedabad, or Hyderabad).

Eligibility: Must be an Indian national residing and studying in one of the eligible regions. For undergraduate courses, applicants should have passed Class 12 with a minimum overall score of 60% (current Class 12 students may apply based on previous records). Must come from a lower-income group. Preference will be given to STEM students, female students, and eligible specially-abled or transgender candidates.

Prizes & Rewards: Financial support for covering key educational expenses.

Last Date to Apply : 31-05-2025

Application mode : Online applications only

Short Url: www.b4s.in/aj/TCSP5

The Doon School Scholarship

The Doon School Scholarship Examination (DSSE) is an annual entrance exam conducted by the Doon School, Dehradun, Uttarakhand. The scholarship exam is open to male students entering Class 7 or 8, whose families may find it difficult to pay the school fees.

Eligibility: This is open to Indian male students. Applicants must be between 11 to 13 years old as of 30th September 2025. Students must be promoted to Class 7 or 8 in the upcoming academic year.

Prizes & Rewards : An opportunity to pursue studies at the Doon School with financial assistance in the form of scholarship.

Last Date to Apply : 15-04-2025

Application mode: Online and offline via email at (admissions@doonschool.com)

Short Url: www.b4s.in/aj/DSSE2

buddy4study.com

మేనేజ్‌మెంట్ కోర్సుల్లో అడ్మిషన్స్

జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలంటే మేనేజ్‌మెంట్ కోర్సులు చేయాలనే భావం స్థిరపడి పోయింది. సైన్స్, ఆర్ట్స్, కామర్స్ ఇలా ఏ బ్యాక్‌గ్రౌండ్ నుంచి వచ్చిన వారికైనా మేనేజ్‌మెంట్ కోర్సులు చేసే అవకాశం ఉంది. అలాగే ఏదో ఒక ఉద్యోగం చేసుకుంటున్నవారు కూడా ఈ కోర్సులు చేసి కెరీర్‌లో మరింత ముందుకు వెళ్లగలుగుతున్నారు. కొన్ని ప్రతిష్ఠాత్మక సంస్థల మేనేజ్‌మెంట్ కోర్సుల నోటిఫికేషన్ వెలువడింది. ఒకసారి పరిశీలించండి.

ఐపీఈ హైదరాబాద్

హైదరాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ 2025-27 విద్యా సంవత్సరానికి పీజీడీఎం ప్రోగ్రామ్‌లో ప్రవేశాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఆసక్తి గల అభ్యర్థులు 2025 మార్చి 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు https://www.ipeindia.org/ వెబ్‌సైట్ చూడవచ్చు.

ప్రోగ్రామ్‌లు

పీజీడీఎం - పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్
పీజీడీఎం - మార్కెటింగ్ మేనేజ్‌మెంట్



పీజీడీఎం - బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్
పీజీడీఎం - ఇంటర్నేషనల్ బిజినెస్
పీజీడీఎం - హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్
పీజీడీఎం - బిజినెస్ అనాలిసిస్

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో డిగ్రీ, క్యాట్/గ్మాట్/జీమ్యాట్/ మ్యాట్/ సీమ్యాట్/ ఏటీఎంఏ టెస్ట్ స్కోరు ఉండాలి.
ఎంపిక ప్రక్రియ: గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ
ఇంటర్వ్యూ తేదీ: 2025 ఏప్రిల్ 12

'నిట్' కురుక్షేత్ర

హరియాణ రాష్ట్రం కురుక్షేత్రలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ 2025-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంబీఏలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఆసక్తి గల అభ్యర్థులు 2025 మే 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. వివరాలకు https://nitkkr.ac.in వెబ్‌సైట్ చూడవచ్చు.

అర్హత: గ్రాడ్యుయేషన్‌తోపాటు, క్యాట్/ సీమ్యాట్/ మ్యాట్ స్కోరు ఉండాలి.
ఎంపిక ప్రక్రియ: గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఉంటుంది.
చివరి తేదీ: 2025 మే 5
గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ తేదీ ప్రకటన: 2025 మే 8

ఐఐఎం బోధ్‌గయ

ఐఐఎం బోద్‌గయ, టీంలీజ్ ఎడ్యుటెక్‌తో కలిసి ఆన్‌లైన్ 'ఎగ్జిక్యూటివ్ మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్'(ఈఎంబీఏ)ని డిజైన్ చేసింది. ఈ రెండు సంవత్సరాల ఆన్‌లైన్ కోర్సు మధ్య స్థాయి నుంచి సీనియర్ స్థాయిలో ఉన్న ఎగ్జిక్యూటివ్‌లకు ఉపయోగపడుతుంది. ఫైనాన్స్, మార్కెటింగ్, ఆపరేషన్స్, స్ట్రాటజీ తదితర సబ్జెక్టులు ఇందులో ఉంటాయి. వివరాల కోసం https://iimbgonline.in/ వెబ్‌సైట్ చూడవచ్చు.

JOBS
ఇండియన్ నేవీలో అగ్నివీర్



భారత నౌకాదళంలో అగ్నివీర్ ఖాళీల నియమకానికి నోటిఫికేషన్ వెలువడింది. ఎంపికైన వారికి 'ఐఎన్ఎస్ చిల్కా'లో శిక్షణ ఉంటుంది. 2025, 2026 బ్యాచ్‌లకు సంబంధించిన నోటిఫికేషన్ ఇది.

ప్రకటన పేరు: అగ్నివీర్(మెట్రిక్ రిక్రూట్-ఎంఆర్) ఖాళీలు
అర్హత: పదో తరగతి పాసైన అవివాహిత స్త్రీ, పురుష అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
వయస్సు: 02/2025 బ్యాచ్ కోసం దరఖాస్తు చేసుకునే వారు 2004 సెప్టెంబరు 1 నుంచి 2008 ఫిబ్రవరి 29 మధ్యలో జన్మించి ఉండాలి. 01/2026 బ్యాచ్ కోసం దరఖాస్తు చేసుకునే వారు 2005 ఫిబ్రవరి 1 నుంచి 2008 జూలై 31 లోపు జన్మించి ఉండాలి. 02/2026 బ్యాంక్ కోసం దరఖాస్తు చేసుకునే వారు 2005 సెప్టెంబరు 1 నుంచి 2008 డిసెంబర్ 31లోపు జన్మించి ఉండాలి.
ఎంపిక ప్రక్రియ: నేవీ ఎంట్రెన్స్ ద్వారా షార్ట్ లిస్ట్ చేస్తారు. రాత పరీక్ష, శారీరక దారుఢ్య పరీక్ష, వైద్య పరీక్ష ఉంటాయి.
పరీక్ష: ప్రశ్నపత్రం హిందీ/ఇంగ్లీష్ బాషల్లో ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం 50 మల్టిపుల్ ఆన్సర్ ప్రశ్నలు ఉంటాయి. ఇంగ్లీష్, సైన్స్, మేథ్స్ జనరల్ అవేర్‌నెస్ నాలుగు విభాగాలు పదో తరగతి స్థాయిలో ఉంటాయి.
దరఖాస్తుకు చివరి తేదీ: 2025 ఏప్రిల్ 10
ఎంట్రెన్స్ టెస్ట్: 2025 మే 25న
వెబ్‌సైట్ : https://www.joinindiannavy.gov.in/

ఆదివాసీలపై హింసకు వ్యతిరేకంగా పోరాడాలి

పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ చంద్రశేఖర్


సభలో ప్రసంగిస్తున్న పౌరహక్కుల సంఘం కార్యదర్శి చంద్రశేఖర్

మంగళగిరి సిటీ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలపై జరుగుతున్న రాజ్య హింసకు వ్యతిరేకంగా పోరాడాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ చంద్రశేఖర్ పిలుపు నిచ్చారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర స్థాయి సభ మంగళగిరిలోని వేములపల్లి శ్రీకృష్ణభవన్‌లో ఆదివారం జరిగింది. ఎస్కే నాగూర్‌వలి అధ్యక్షతన జరిగిన ఈ సభలో చంద్రశేఖర్ మాట్లాడుతూ ఛత్తీస్‌ఘడ్‌లో గత ఏడాది నుంచి పోలీసులు చేస్తున్న ప్రతి ఎన్‌కౌంటర్ బూటకమని పేర్కొన్నారు. కేవలం ద్రౌపది ముర్ము లాంటి వ్యక్తులను రాష్ట్రపతిగా చూపించి ఆదివాసీలపై బూటకపు ప్రేమను కనబరుస్తున్నారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బేషరతుగా మావోయిస్టులతో చర్చలు జరిపి కాల్పుల విరమణ చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక కార్య దర్శి పొనుగోటి కృపాకర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ ప్రశ్నించే వ్యక్తులపై దాడులు, హత్యలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు బలమైన ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభలో పౌరహక్కుల సంఘం నేతలు కోటేశ్వరరావు, గోపీనాథ్, మంజు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక నుంచి మిర్చి తెస్తున్న వ్యాపారస్థులు

- రైతుల పేర్లతో మిర్చియార్డులో విక్రయం
- రికార్డుల్లో రొటేషన్ అవుతున్న కొందరి పేర్లు
- రైతుల మిర్చిని మాత్రమే కొనుగోలు చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాలు



గుంటూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో కొంతమంది వ్యాపారస్థులు రైతుల ముసుగు ధరిస్తున్నారు. కర్ణాటక రాష్ట్రంలో మిర్చి క్వింటాల్ ధర రూ. 6 వేలు మాత్రమే ఉండటంతో అక్కడి రైతుల వద్ద కొనుగోలు చేసి ఇక్కడికి తీసుకొస్తున్నారు. యార్డులో వ్యాపారస్థులు మిర్చిని అమ్మడానికి వీలు లేకపోవడంతో కొంతమంది రైతుల ఆధార్‌లు, వారి బ్యాంకు అకౌంట్ల వివరాలు తీసుకుని వాళ్ల పేర్లతో మిరపకాయలను అమ్మి సొమ్ము చేసుకొంటున్నారు. గత కొద్ది రోజుల నుంచి కర్ణాటక నుంచి ఎక్కువ మోతాదులో మిర్చి ఇక్కడికి దిగుమతి అవుతుండడానికి ఇదొక కారణంగా మార్కెటింగ్ అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులు తీసుకొచ్చే మిర్చిని మాత్రమే యార్డులోకి అనుమతించాలని సిబ్బందికి నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి, హుబ్లీ, హోస్‌పేట, రాయ్‌చూర్ వంటి ప్రాంతాల్లో మిర్చి ధర భారీగా పతనమైంది. అక్కడి మార్కెట్ కమిటీల్లో మిర్చి క్వింటాల్ ధర రూ.6 వేలు మాత్రమే ఉన్నది. ఈ విషయాన్ని తెలుసుకొన్న కొంతమంది వ్యాపారస్థులు నేరుగా అక్కడికి వెళ్లి రైతుల వద్ద మిర్చిని తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఆ మిర్చిని గుంటూరు మార్కెట్ కమిటీకి తరలించి రైతుల పేర్లతో కమీషన్ దుకాణాల వద్ద దిగుమతి చేస్తున్నారు. అక్కడి నుంచి వస్తున్న మిర్చిలో నాణ్యత ఏమాత్రం ఉండటం లేదు. తేమ, తాలు శాతం అధిక మోతాదులో ఉంటున్నాయి. దీంతో ఇక్కడి ఎగుమతిదారులు క్వింటాల్‌కి రూ. 8 వేల నుంచి రూ. 9 వేల ధర మాత్రమే చెల్లిస్తున్నారు.

దీని వలన రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల రైతులు తీసుకొస్తున్న మిర్చి ధరపై ఆ ప్రభావం పడుతున్నది. అధిక ఎరైవల్స్ కారణంగా మార్కెట్ కమిటీకి వచ్చిన సరుకు అదే రోజు బయటకు వెళ్లిపోవడం లేదు. ఈ కారణంగా కొనుగోళ్లు ఆశాజనకంగా జరగడం లేదు. దీంతో ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ. 11,781 కంటే తక్కువకే రైతులు అమ్ముకోవాల్సిన దుస్థితి. గత కొన్ని రోజులుగా వస్తున్న ఎరైవల్స్‌లో కొంతమంది రైతుల పేర్లు రొటేషన్ అవుతున్నట్లు అధికారవర్గాలు గు ర్తించాయి. ఇదే విషయాన్ని మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్నా యుడుకి నివేదించాయి. దీనిపై ఆయన స్పందించి రైతులు తీసుకొచ్చే మిర్చిని మాత్రమే కొనుగోలు చేయాలని ఆదేశించారు. వ్యాపారస్థులు తీసుకొచ్చే మిర్చిని ఎట్టి పరిస్థితుల్లో లోపలికి అనుమతించొద్దన్నారు. మంత్రి ఆదేశాలను ఏమేరకు అమలు చేస్తారో మంగళవారం చూడాలి.

తులసీ రామచంద్రప్రభు సేవలు స్ఫూర్తిదాయకం

- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్
- రూ. 30 లక్షల ఉపకార వేతనాల పంపిణీ


విద్యార్థినికి స్కాలర్‌షిప్పు చెక్కును అందజేస్తున్న పెమ్మసాని, చిత్రంలో తులసీ రామచంద్రప్రభు, యోగీష్‌చంద్ర, కృష్ణచైతన్య తదితరులు

గుంటూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తులసీ సీడ్స్ సంస్థల చైర్మన్ తులసీ రామచంద్రప్రభు సేవలు స్ఫూర్తిదాయకమని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్ మేనేజింగ్ ట్రస్టీ తులసీ రామచంద్రప్రభు ఆధ్వర్యంలో రింగ్‌రోడ్డులోని శుభం కన్వెన్షన్‌లో ఆదివారం 570 మంది ప్రతిభ గల పేద విద్యార్థులకు 30 లక్షల రూపాయల ఉపకార వేతనాలను పెమ్మసాని చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ రామచంద్రప్రభు ఎటువంటి ప్రత్యక్ష రాజకీయాలలో లేకపోయినా యువతకు విద్య, ఉద్యోగ విషయాలలో తోడ్పడుతూ, ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడినప్పుడు ప్రభుత్వానికి లక్షల రూపాయలను వెచ్చిస్తున్నారని తెలిపారు. రామచంద్రప్రభు ఆశయాన్ని అర్థం చేసుకుని వారు అందించే ఈ సహాయాన్ని సద్వినియోగం చేసుకుని కష్టపడి చదువుకుని ఉన్నత స్థానానికి చేరుకుని సమాజానికి మేలు చేయాలని కోరారు. గుంటూరు సర్వజనాసుపత్రికి, మెడికల్ కళాశాల బస్సులకు పది కోట్ల రూపాయలు విరాళంగా ఇవ్వడం చాలా గొప్ప విషయమని ప్రభు సేవలను ఆయన కొనియాడారు. తులసి రామచంద్ర ప్రభు మాట్లాడుతూ తాను చదువుకునే రోజులలో కేవలం 16 రూపాయలు పదో తరగతికి పరీక్ష ఫీజు కట్టలేని గడ్డు పరిస్థితిని ఎదుర్కొన్నానని, ఇంటర్, బీటెక్ చదివే రోజుల్లో గవర్నమెంట్ నుంచి వచ్చిన 450 రూపాయలు ఉపకారవేతనాలతో చదువుకుని జీవితంలో స్థిరపడ్డానని గుర్తుచేశారు. తిరిగి సమాజానికి ఇవ్వాలనే ఉద్దేశంతో 1995-96 లో ఇద్దరు విద్యార్థులతో మొదలుపెట్టి నేటికి 36 వేల మంది విద్యార్థులకు రూ. 22 కోట్ల ఉపకారవేతనాలుగా పంపిణీ చేసినట్లు ఆయన తెలియజేశారు. అలాగే 2022, 2023, 2024 సంవత్సరాల్లో దరఖాస్తు చేసుకున్న వారందరికీ కూడా మొత్తం రూ. 30 లక్షలు ఉపకార వేతనాలు పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్,అండర్ ప్రివిలేజ్డ్ ట్రస్ట్ ట్రస్టీలు తులసీ యోగీష్ చంద్ర, తులసీ కృష్ణ చైతన్య, నారదాసు శ్రీహరిరావు, మలిశెట్టి సుబ్బారావు, ఉగ్గిరాల సీతారామయ్య, తోట శంకరరావు, తిమ్మిశెట్టి నారాయణరావు, చందనం శ్రీనివాస్, పసుపులేటి రమణయ్య, అంకిరెడ్డి సాంబశివరావు, నారదాసు కోటేశ్వరరావు, జంగాల సాంబశివరావు, మేకల రవీంద్ర, పుచ్చకాయలు ఆనంద్, కనాథం నరేంద్రనాథ్, దళవాయి సుబ్రహ్మణ్యం, మిరియాల శ్రీనివాస్, పంతంగి జనార్దనరావు, తులసి ఆదిత్యచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎడ్లపోటీల్లో గడివేముల జతకు ప్రథమస్థానం


రెండు పళ్ల విభాగంలో బండ లాగుతున్న ఎడ్లు


తెనాలి అర్బన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : తెనాలి మార్కెట్ యార్డులో జరుగుతున్న ఆలపాటి శివరామకృష్ణయ్య మెమోరియల్ జాతీయస్థాయి ఎడ్ల బల ప్రదర్శనలో రెండు పళ్ల విభాగంలో నంద్యాల జిల్లా గడివేములకు చెందిన ఎరుమాళ్ల సంజయ్‌కుమార్ ఎడ్ల జత ప్రథమ స్థానం సాధించింది. 10 నిమిషాల సమయంలో 3592 అడుగుల దూరం బండ లాగాయి. ఆదివారం జరిగిన ఈ విభాగంలో 14 జతల ఎడ్లు పోటీ పడ్డాయి. పల్నాడు జిల్లా ఇస్సపాలెంకు చెందిన వెంకటరామాంజనేయులు ఎడ్ల జత 3228 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానం సాధించాయి. బాపట్ల జిల్లా జే పంగులూరుకు చెందిన గొట్టిపాటి రవికుమార్ యూత్, పల్నాడు జిల్లా మాచాయిపాలెంకు చెందిన చెరుకూరి నాగేశ్వరరావు, కార్తికేయల కంబైన్స్ ఎడ్ల జత 2979.10 అడుగుల దూరం లాగి తృతీయ స్థానం, ఎన్టీఆర్ జిల్లా మైలవరం సామ్రాజ్యమ్మ బుల్స్ 2821 అడుగులు లాగి నాల్గో స్థానం, బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం పోసపాడుకు చెందిన లిఖిత చౌదరి ఎడ్లు 2700 అడుగుల దూరం లాగి ఐదో స్థానం, బాపట్ల జిల్లా నాగరాజుపల్లికి చెందిన హర్షవర్ధన్ ధనుష్ ఎడ్ల జత 2529 అడుగుల దూరం లాగి ఆరో స్థానం, బాపట్ల జిల్లా మరుప్రోలు వారిపాలెంకు చెందిన వెంకట అయ్యప్ప రెడ్డి గార్లపాడు రైతు చాన్వికచౌదరి కంబైన్స్ ఎడ్లు 2501 అడుగుల దూరం లాగి ఏడో స్థానం, ఎరుకలపూడి, సంగం జాగర్లమూడి రైతులు శ్రీను, సాత్విక్, రవీంద్రవర్మల ఎడ్లజత 2384 అడుగుల దూరం లాగి 8వ స్థానం, దోనేపూడి రైతు వెనిగళ్ల యజ్ఞశ్రీ ఎడ్ల జత 2342 అడుగుల దూరం లాగి 9వ స్థానంలో నిలిచాయి. విజేతలకు (వరుసగా ప్రథమ నుంచి 9వ స్థానం వరకు) దాతలు పరుచూరి పవన్ రూ.30 వేలు, వంగా సాంబిరెడ్డి రూ.25 వేలు, అమ్మిశెట్టి కిషోర్, తాడికొండ విశ్వేశ్వరరావు రూ.20 వేలు, రేపల్లె సుభాని రూ.15 వేలు, పెమ్మసాని జయప్రకాష్‌రూ.12వేలు, వట్టికూటి ప్రసాద్ రూ.10వేలు, పణిదపు దుర్గ రూ.8వేలు, చందోలు పృథ్వీలత రూ.6వేలు, జాస్తి బసవయ్య రూ.5 వేలు బహుమతులు అందజేశారు. మిగిలిన పోటీల్లో పాల్గొన్న జతలకు రూ.5 వేలు బహుమతులు అందించారు. పోటీలను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, పలువురు టీడీపీ నాయకులు పర్యవేక్షించారు.

ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతి

చిలకలూరిపేట, మార్చి30 (ఆంధ్రజ్యోతి): అతివేగంగా ట్రాక్టర్ నడుపుతూ తిరగబడటంతో డ్రైవర్ మృతి చెందిన సంఘటన చిలకలూరిపేట మండలం రామచంద్రాపురం గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జెడ శామ్యూల్(19) ట్రాక్టర్ నడుపుతుండగా అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో అతడు ట్రాక్టర్ ఇంజన్ కింద పడి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న చిలకలూరిపేట రూరల్ పోలీసులు గ్రామానికి వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రూరల్ ఎస్ఐ జీ అనిల్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగు వైభవాన్ని ముందు తరాలకు అందించాలి

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్
- వైభవంగా సాహితీ వసంతోత్సవం


ప్రముఖ సినీ గేయ రచయిత రసరాజుకు సాహితీ పురస్కారం అందజేసి సత్కరిస్తున్న జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్, కృష్ణబాబు, పులి శ్రీనివాసులు, సాహితీ సమాఖ్య సభ్యులు

గుంటూరు(తూర్పు), మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తెలుగు ఔన్నత్యాన్ని, వైభవాన్ని ముందు తరాలకు అందించేలా నేటి తరం కృషి చేయాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ అన్నారు. ఆదివారం గుంటూరు వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సాహితీ సమాఖ్య, ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా 28 వసంతాల సాహితీ వసంతోత్సవం వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిలుగా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ రాష్ట్ర ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు హాజరయ్యారు. సభకు జిల్లా సాహితి సమాఖ్య అధ్యక్షుడు డీవీఎస్‌బీ రామమూర్తి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలను ప్రోత్సహించేందుకు ఇలాంటి వేదికలను ఏర్పాటు చేస్తున్న సాహితి సమాఖ్య కృషి అభినందనీయం అన్నారు. కవి సమ్మేళనాలు మండలస్థాయిలో కూడా నిర్వహించాలని సూచించారు. ఎం టీ కృష్ణబాబు మాట్లాడుతూ విశ్వావసు నామ సంవత్సరంలో ప్రతి ఒక్కరికీ శుభం కలుగుతుందని ఆకాంక్షించారు. రాశి ఫలాలు, ముహూర్తాలు కేవలం అపోహ మాత్రమేనని కష్టం, ప్రయత్నం మనల్ని జీవితంలో గెలిపిస్తుందని అన్నారు. ముహూర్తాలను నమ్మి తెలుగు రాష్ట్రాల్లో 53 శాతం నవ జంటలు శస్త్రచికిత్సల ద్వారా పిల్లలను కంటున్నారని ఇది బాధాకరమన్నారు. ముహూర్తాలపై అపోహలు తొలగించాల్సిన బాధ్యత పండితులపై ఉందన్నారు. మనతోపాటు సమాజం కూడా బాగుండాలనేదే పీ 4 లక్ష్యమని, ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. అంతకు ముందు విష్ణుసహస్రనామ పారాయణం, వేద పఠనం, శ్రీమాన్ గుదిమెళ్ల శ్రీకూర్మనాథ స్వామి పంచాంగ శ్రవణం, ఆర్ సూర్యలక్ష్మీ చే నాదస్వర కచేరి జరిగింది. ప్రముఖ సినీ గేయ రచయిత రసరాజు, సినీ నటుడు కేదార్ శంకర్, వీవీ రామ్‌కుమార్, రచయిత కే కృష్ణవేణి, అష్టావధాని సల్లాన్ చక్రవర్తుల సాహిత్, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్ కవి సమ్మేళనం నిర్వహించారు. అనంతరం విశ్వావసు నామ సాహితీ పురస్కారం కవి, సినీ గేయ రచయిత రసరాజుకు, ఆత్మీయ సత్కారం ప్రముఖ సినీ నటుడు కేదార్ శంకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి తదితరులు పాల్గొనగా, కార్యక్రమాన్ని సాహితీ సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎస్.వి.ఎస్. లక్ష్మీనారాయణ, ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్టు కార్యదర్శి పి.రామచంద్రరాజు పర్యవేక్షించారు.

స్లాట్ తీసుకుంటేనే రిజిస్ట్రేషన్

గుంటూరు జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్ షరీల్ బాబు

గుంటూరు సిటీ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో స్లాట్ (ముందస్తు అపాయింట్ మెంట్) బుక్ చేసుకున్న వారు మాత్రమే ఆస్తుల రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉన్నట్లు గుంటూరు జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్ ఎం షరీల్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 2వ తేదీ నుంచి ఈ విధానం అమల్లోకి వస్తుందని తెలిపారు. ప్రతి రోజు 72 స్లాట్‌లు అందుబాటులో వుంటాయని, ప్రజలు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో గంటల కొద్దీ సమయం వేచి చూసే పనిలేకుండా సులభంగా రిజిస్ట్రేషన్‌లు చేయించుకునేందుకు కూటమి ప్రభుత్వం ఈ కొత్త పద్ధతిని అమల్లోకి తీసుకువచ్చినట్లు ఆయన వివరించారు. ముందుగా జిల్లా కేంద్రంలోని జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పైలెట్ ప్రాజెక్టు కింద స్లాట్ బుకింగ్ పద్ధతిని ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. స్లాట్ బుక్ చేసుకోకుండా నేరుగా కార్యాలయానికి వస్తే రిజిస్ట్రేషన్ చేయటం వీలు పడదని తెలిపారు. కావున ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి అందుబాటులో ఉన్న సేవా కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకుని రిజిస్ట్రేషన్ కు రావాలని సబ్ రిజిస్ట్రార్ ఎం షరీల్ బాబు సూచించారు. ఈ విషయాన్ని ప్రజల కు వివరించేందుకు, అవగాహన సదస్సులు కూడా ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

మద్యం షాపు తొలగించాలని మహిళల నిరసన

తెనాలి క్రైం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ముత్తింశెట్టిపాలెంలో ఇళ్ల మధ్యలో ఏర్పాటు చేసిన మద్యం షాపును తొలగించాలని ఆదివారం మహిళలు, స్థానికులు పెద్దఎత్తున ఆందోళన నిర్వహించారు. ఇక్కడికి వచ్చే తాగుబోతుల వల్ల సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఈ మార్గం గుండానే


మద్యం షాపు వద్ద ఎండలో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు, స్థానికులు

వైకుంఠపురం దేవాలయానికి వెళ్లేవారికి, పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, మహిళలకు రక్షణ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇరుకు మార్గం కావడంతో ట్రాఫిక్ అధికంగా ఉంటుందన్నారు. ఇలాంటి ప్రాంతంలో మద్యం షాపు ఏర్పాటు చేసి సమస్యలు సృష్టించవద్దంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు టెంట్‌లు వేసుకుని మహిళలు నిరసన దీక్ష చేపట్టారు. అనంతరం ర్యాలీగా వెళ్లి ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. పోలీసుల పహారా మధ్య ఈ ప్రాంత వాసులు రాత్రయినా ధర్నా కొనసాగిస్తూనే ఉన్నారు.

రేపు జాతీయస్థాయి నాటకోత్సవాలు ప్రారంభం


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కాంతారావు, బ్రహ్మచార్యులు

తెనాలి అర్బన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : 14వ జాతీయ స్థాయి నాటకోత్సవాలు మంగళవారం ప్రారంభమవుతాయని పోస్టల్ ఉద్యోగుల కళా పరిషత్ అధ్యక్షులు డీఎల్ కాంతారావు తెలిపారు. నాటకోత్సవాల కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో దావులూరి సోమశేఖరరావు కళా ప్రాంగణంలో రెండు రోజుల పాటు ఈ నాటకోత్సవాలు జరుగుతాయన్నారు. నట సార్వభౌమ నందమూరి తారక రామారావు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును మంగళవారం ప్రముఖ రంగస్థల నటి, రచయిత్రి కె.విజయలక్ష్మికి ప్రదానం చేస్తామని, శాసన మండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని నాటకోత్సవాలను ప్రారంభిస్తారని చెప్పారు. హైదరాబాద్ సిరిమువ్వ కల్చరల్స్ కళాకారులు జేబు చెప్పిన ఊసులు సాంఘిక నాటిక ప్రదర్శిస్తారని, బుధవారం డీఎల్ కాంతారావు పోస్టల్ ఉద్యోగుల కళా పరిషత్ కళాకారులు ది లెసన్ సాంఘిక నాటికను, విశాఖపట్నం సాయి కళానికేతన్ కళాకారులు పౌరాణిక పద్య నాటకం శశిరేఖ పరిణయం ప్రదర్శిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పరిషత్ ప్రధాన కార్యదర్శి బ్రహ్మచార్యులు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్కేటింగ్‌లో హాశిష్‌కు మూడు సిల్వర్ మెడల్స్


అంతర్జాతీయ స్కేటింగ్ పోటీలలో ద్వితీయ స్థానం సాధించిన హాశిష్

తాడేపల్లి టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తైవాన్‌లోని చైనీస్ తైపీ రోలర్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి 30 వరకు జరిగిన అంతర్జాతీయ స్కేటింగ్ పోటీలలో ఇండియా నుంచి తాడేపల్లి పట్టణం డోలాస్‌నగర్‌కు చెందిన మెరుగుపాల హాశిష్ పాల్గొన్నాడు. హాశిష్ ఆర్టిస్టిక్ స్కేటింగ్ విభాగంలో ఫ్రీ స్టయిల్, ఇన్‌లైన్, సోలో డాన్స్ పోటీలలో తలపడి ఆయా మూడు విభాగాలలో ద్వితీయ స్థానంతో మూడు సిల్వర్ మెడల్స్ సాధించాడు. హాశిష్ గత ఏడాది డిసెంబర్‌లో తమిళనాడు పొలాచ్చిలో జరిగిన రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో బంగారు పతకం సాధించాడు. ఈ సందర్భంగా క్రీడాకారుడు హాశిష్‌ను కోచ్ పీ సత్యనారాయణ, చిట్టిబాబు, రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సీ నీలిమ, పీ శ్రీకాంత్‌లు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

అచ్చంపేట, మార్చి 30(ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఆదివారం పల్నాడు జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-20, 15 పురుషులు, స్త్రీల రెజ్లింగ్ ఎంపికలు జరిగినట్టు కార్యదర్శి గుడిపూడి భూషణం తెలిపారు. అండర్ 20 స్త్రీల విభాగంలో గాయత్రి బాయి(సాగర్), కే బ్యూల(వినుకొండ), బీ నేహాస్త్రీ(బ్రాహ్మణ కోడూ రు), ఎం దీపిక భువన(సాగర్), అండర్-20 పురుషుల విభాగంలో కే లాలూనాయక్(రామనీపురం తండా), ఎన్ శ్రీకర్‌ప్రసాదు(గోరంట్ల), టీ సుమంత్(ఆవులవారిపాలెం), ఎస్ బాలకోటేశ్వరరావు(పిడుగురాళ్ళ), పీ విజయ్‌బాబు(ఖాజా), కే కిరణ్(చల్లగరిగ), డీ కుమార్‌బాబు(లగడపాడు), పీ చంటి(బాలెమర్రు), కే భరత్‌కుమార్(రావిపాడు), బీ కళ్యాణ్(గొట్టిపాడు), కే ప్రభాకర్(ఓబులేసునిపల్లె), ఎం అఖిల్(పిడుగురాళ్ళ), అండర్-15 బాలికకల విభాగంలో ఎన్ లావణ్య, కే అ నూష, బీ అలేఖ్య, ఎం పూజి త, ఏ పూజిత, ఎస్ మేరీవెన్నెల, డీ స్మృతి, జీ గాయత్రి(సాగర్), అండర్-15 బాలుర విభాగంలో పీ నాగచైతన్య, ఓ గౌరిప్రతాప్, ఏ ప్రణీత్, సీహెచ్ రాంబాబు(అచ్చంపేట), కే ఆదిత్య, వీ పవన్ కుమార్, కే అంకిత్‌రాజు(అడవితక్కెళ్ళపాడు), యూ ఆనంద్ భానుప్రసాదు(దుగ్గిరాల), పీ పునీత్(వరహాపురం)లు ఉన్నారు. ఎంపికైనవారు ఏప్రిల్ 4, 5, 6 తేదీల్లో రాజమండ్రిలో జరగనున్న రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొననున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.70
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	145, 154, 165
చికెన్ విత్ స్కిన్(కిలో)	280.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	290.00

రంజాన్ వేడుకలకు భద్రతా చర్యలు

● ఎస్పీ తుషార్ డూడి


మాట్లాడుతున్న ఎస్పీ తుషార్‌డూడి

బాపట్ల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ప్రశాంత వాతావరణంలో ముస్లింలు రంజాన్ వేడుక జరుపుకునేందుకు తగిన భద్రతా చర్యలు తీసుకున్నామని ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. ఈ విషయమై ఆదివారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మసీదులు, ఈద్గాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఆదివారం ఉపవాసదీక్షలు ముగించుకొని సోమవారం ఈద్‌ఉల్‌ఫితర్ జరుపుకునేందుకు సిద్ధమౌతున్న ముస్లింలకు ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో వేడుక జరుపుకోవాలని ఆకాంక్షించారు. సోషల్‌మీడియాపై నిఘా ఉంచామన్నారు. ఎవరైనా కుల, మత వైషమ్యాలను రెచ్చగొట్టే విధంగా వదంతులు వ్యాప్తి చేస్తే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిఘా కోసం సీసీ కెమెరాలు, డ్రోన్‌లను వినియోగించనున్నామన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామన్నారు. అందరి జీవితాలలో రంజాన్ వెలుగులు నింపాలని సుఖసంతోషాలతో జీవించాలని ఎస్పీ కోరారు.

గీత రచయిత నందిరాజుకు ఉగాది పురస్కారం

బాపట్ల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : విభిన్న రంగాలలో విశిష్ట సేవలందిస్తున్న ప్రముఖులకు ఉగాది పురస్కారాలను అందజేశారు. కలెక్టర్ జె.వెంకటమురళి ఆధ్వర్యంలో ఏపీహెచ్‌ఆర్‌డీ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన శ్రీవిశ్వావసు నామ తెలుగు సంవత్సర ఉగాది వేడుకలలో భాగంగా జిల్లా గీత రచయిత నందిరాజు విజయ్‌కుమార్‌కు సాహిత్యంలో ఉగాది పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, ఎమ్మెల్సీ పోతుల సునీత తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా అవార్డు గ్రహీతలను ఫోరంఫర్‌బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ.సాయిబాబు, జిల్లా రచయతల సంఘం అధ్యక్షులు తిమ్మనశ్యామ్ సుందర్, ధృతి సంస్థ వ్యవస్థాపకులు కళ్ళం హరినాధరెడ్డి, బాపట్ల పుస్తకోద్యమ సమితి కార్యదర్శి జీవీ, మానం అప్పారావు తదితరులు వారిని అభినందించారు.


జిల్లా గీత రచయిత నందిరాజు విజయ్‌కుమార్‌కు ఉగాది పురస్కారం అందజేస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి

ఆయుర్వేద వైద్యుడికి ఘన సన్మానం

బాపట్ల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల భావపురి సీనియర్ సిటిజన్స్ సాహితిభారతి ఆధ్వర్యంలో ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ శ్రీనివాస్‌ను ఉగాది సందర్భంగా ఆదివారం ఘనంగా సన్మానించారు. బాపట్ల జిల్లా సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు జీవీ బ్రహ్మం, పట్టణ అధ్యక్షుడు కె.హరిరావు, కార్యదర్శి జేవీ కృష్ణారావు, కోశాధికారి బొలగాని వెంకటేశ్వర్లు, బందా బాబు, సాహితిభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ, ఉపాధ్యక్షుడుమర్రి మాల్యాద్రిరావు, కామరాజు కాళీదాసు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, జీవీ సుబ్రహ్మణ్యం, బొలగాని విజయలక్ష్మి తదితరులు డాక్టర్ శ్రీనివాస్ కనిపెట్టిన కొత్తమూలిక వైద్యం గురించి వివరించారు. డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ చావు బతుకుల్లో ఉన్న ఎందరో పేదవారికి వైద్యసేవలందించి మెరుగుపరిచానని, క్యాన్సర్ వ్యాధికి తగిన ఆయుర్వేద మందును కొనుగొని చావు బతుకుల్లో ఉన్న ఓ వ్యక్తికి ఆ మందును అందించి బతికించానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్, సాహితి భారతి సభ్యులు పాల్గొన్నారు.


డాక్టర్ శ్రీనివాసులను సత్కరిస్తున్న సీనియర్ సిటిజన్స్, సాహితి భారతి సభ్యులు

చలివేంద్రం ప్రారంభం

బాపట్ల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఉగాది సందర్భంగా ఆర్డీవో పి.గ్లోరియా ప్రారంభించారు. నిత్యం పనుల మీద కార్యాలయానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ సలీమా, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.


తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీవో పి.గ్లోరియా

ప్రవీణ్ మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలి

బాపట్ల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణంపై సమగ్ర విచారణ కోరుతూ పట్టణంలోని ఇండియా పెంతుకోస్తు క్రైస్తవ సంఘం వారు ఆదివారం శాంతియుత ర్యాలీ నిర్వహించారు. దేశవ్యాప్తంగా సంచలనం కలిగించిన ప్రవీణ్ పగడాల మరణంపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. పాస్టర్ కె.గమలియేలు ఆధ్వర్యంలో పట్టణ ఎస్ఐ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. జగన్నాధపురం ఇండియా పెంతుకోస్తు చర్చి సంఘ సభ్యులు పాల్గొన్నారు.


పట్టణ ఎస్ఐ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పెంతుకోస్తు క్రైస్తవ సంఘ సభ్యులు

పెట్రోలు బంకు ప్రారంభం

కర్లపాలెం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం జాతీయ రహదారి పక్కన శ్రీ షణ్ముఖ ఫ్యూయల్ స్టేషన్‌ను మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. శ్రీ విశ్వావసు ఉగాది రోజు ప్రారంభించుకోవటం అభినందనీయమని అన్నారు. నిర్వాహకులు సురేష్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్దనరెడ్డి, ఎంపీపీ యారం వనజ, జిట్టా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వరి కుప్ప దగ్ధం చేసిన దుండగులు

పిట్టలవానిపాలెం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోమలి గ్రామ పంచాయతీకి చెందిన టీడీపీ నాయకుడు కలకోట కిషోర్‌రెడ్డికి చెందిన ఎకరం వరి కుప్పకు గుర్తుతెలియని దుండగులు ఆదివారం తెల్లవారుజామున నిప్పు అంటించారు. ఆయన మాట్లాడుతూ రాజకీయ కక్షతో ఎవరైన కావాలని తగలబెట్టారనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై చందోలు పోలీసుస్టేషన్‌లో కలకోట కిషోర్‌రెడ్డి బావమరది మోదుగుల శివరామిరెడ్డి ఫిర్యాదు చేశారు. భవనంవారిపాలెం టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మోదుగుల శంకరరెడ్డి ఆదివారం సంఘటన స్థలాన్ని పరిశీలించి ఇది హేయమైన చర్య అని అన్నారు.

ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

● పంచాంగాన్ని ఆవిష్కరించిన మంత్రి అనగాని, ఎంపీ తెన్నేటి


రేపల్లె, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో రాష్ట్ర ప్రజలంతా పాడిపంటలతో, సుఖసంతోషాలతో ఉండాలని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో అర్చకసేవాసంఘం బాపట్ల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీవిశ్వావసు నామసంవత్సర తెలుగు పంచాంగాన్ని మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎంపీ కృష్ణప్రసాద్, వేదపండితులు ఆదివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తుందని, నూతన సంవత్సరంలో దేవుని దయతో అభివృద్ధిపథంలో నడవాలని ఆకాంక్షించి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రజలు ఆర్థికంగా నిలదొక్కుకోవటంతోపాటు అన్నివిధాలా అభివృద్ధి చెందాలని అన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని, రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి దిశగా ముందుకువెళతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు యోగానంద్, శావలి సురేష్‌శర్మ, ఆగస్త్యశాస్త్రి పాల్గొన్నారు.

ప్రజలందరికీ శుభాలు : అప్పాజోస్యుల

రేపల్లె, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : శ్రీ విశ్వా వసు నామ సంవత్సరంలో యావత్ ప్రజానీకం సుఖసంతోషాలతో గడుపుతారని వేద పండితులు అప్పాజోస్యుల దక్షిణామూర్తి అన్నారు. ఉగాది పండుగ సందర్భంగా ఆదివారం రామకోటిపేటలోని రాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెలుగు నూతన సంవత్సరంలో కొన్ని రాశులవారికి జాతకరీత్యా శుభాలు కలుగనున్నాయన్నారు. అనంతరం వేద పండితులైన అప్పాజోస్యుల దక్షిణామూర్తి, దివ్యరంగనాధాచార్యులు, నిరాగటం హనుమశాస్త్రిలను సన్మానించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం నూతన పంచాంగాన్ని, క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు సీవీ మోహన్‌రావు, కార్యదర్శి పీబీఎన్ శర్మ, కోశాధికారి విజయశారధి, సభ్యులు రామకృష్ణ, న్యాయవాది దివి శ్రీనివాస్‌కుమార్, దివి సుదర్శన భట్టాచార్యులు, ఎస్.లక్ష్మీనారాయణ, కొండవీటి ఆగస్త్య, పురోహితులు తదితరులు పాల్గొన్నారు.


పండితుడు అప్పాజోస్యుల దక్షిణామూర్తిని సన్మానిస్తున్న బ్రాహ్మణ సమాఖ్య సభ్యులు

శ్రీ భావపురి బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో...


పంచాంగశ్రవణం చేస్తున్న ధూళిపాళ్ళ రామయ్య శాస్త్రి

బాపట్ల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ భావపురి బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం పంచాంగశ్రవణం ఏర్పాటు చేశారు. ఏవీవీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ధూళిపాళ్ళ రామయ్య శాస్త్రి పంచాంగశ్రవణం చేయగా లాలస చక్రికచే కూచిపూడి నృత్యప్రదర్శన ఏర్పాటు చేశారు. అనంతరం శ్రీనివాసుల కృష్ణమాచార్యులు, పూసపాటి వీరాంజనేయ ప్రసాద్, రెంటాల మురళి రాధాకృష్ణమూర్తి దంపతులతోపాటు చివుకుల శ్రీరామమూర్తి, బుద్దరాజు లక్ష్మీవరప్రసాదరావులను ఘనంగా సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ కుటుంబీకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

వేమూరులో...


జంపనిలో పంచాంగ శ్రవణం చేస్తున్న పండిత వెంకట సుబ్బరాయశర్మ

వేమూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మండల పరిధి గ్రామాల్లోని శివ, విష్ణు ఆలయాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ అనంతరం శివాలయాల్లో అభిషేకాలు నిర్వహించారు. వైష్ణవ ఆలయాల్లో స్వామి వారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు వారి గోత్రనామాలతో నూతన సంవత్సరం భగవంతుని అనుగ్రహంతో మంచి జరగాలని కోరుకుంటూ పూజలు జరిపించారు. సాయంత్రం పండితులు పంచాంగ శ్రవణం చేశారు. విశ్వా వసు నామ సంవత్సరంలో కలిగే ఫలితాలను వివరించారు. ఈ సంవత్సరం భగవంతుడిని విశ్వసించి ధర్మంగా నడిచే వారికి మేలు జరుగుతుందని పండితులు అన్నారు. కొన్ని ఆలయాల్లో వార్షిక గ్రామ ఉత్సవాలను జరిపారు.

కొల్లూరులో...

కొల్లూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : తెలుగు నూతన సంవత్సరాది ఉగాది పురస్కరించుకుని పలు ఆలయాల్లో పండితులు పంచాంగ శ్రవణం చేశారు. కొల్లూరులోని అనంత భోగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న పార్వతీ అమ్మవారి దేవస్థానంలో అప్పాజోస్యుల దక్షిణామూర్తి శర్మ ఆదివారం మధ్యాహ్నం పంచాంగ శ్రవణం చేశారు. విశ్వావసు నామ సంవత్సరంలో ఏయే రాశుల వారికి ఎలా ఉంటుం, ఈ నూతన సంవత్సరంలో రాష్ట్ర, దేశ అభివృద్ధి గురించి ఆయన వివరించారు. భక్తులు పంచాంగ శ్రవణాన్ని భక్తిశ్రద్ధలతో ఆలకించారు.

వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో...

భట్టిప్రోలు (కొల్లూరు), మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో పంచాంగ శ్రవణం చేశారు. ఆదివారం విశ్వా వసు నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ఉదయం 10 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఆలయంలో మహాగణపతి, లక్ష్మీసరస్వతి పూజలను పాతూరి రామకాంత శర్మ జరిపారు. అనంతరం గ్రామానికి చెందిన వాస్తు సిద్ధాంతి పండితులు వంగర చలమయ్య పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం భక్తులకు పంచాంగాలు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాలను దేవస్థాన కమిటీ అధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా పర్యవేక్షించారు.

చుండూరు మండలంలో...

చుండూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మండల గ్రామాల్లో విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు సంప్రదాయబద్ధంగా జరిగాయి. దేవాలయాలను రంగు రంగుల పూలమాలలతో, విద్యుత్ దీపాలతో అలంకరించారు. చినపరిమిలో వందల సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయంలో స్వామి వారి పూజలు, పంచాంగ శ్రవణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. యడ్లపల్లి, వలివేరు, చుండూరు, మోదుకూరు, మండూరు, ఆలపాడు, వేటపాలెం దేవాలయాల్లో పంచాంగ శ్రవణం జరిపి భక్తులకు పంచాంగం పుస్తకాలు, తీర్థ ప్రసాదాలు అందించారు.

శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానంలో...


శ్రీ విశ్వనాయకి అలంకారంలో శ్రీబగళాముఖి అమ్మవారు

పిట్టలవానిపాలెం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో శ్రీవిశ్వావసు నామ సంవత్సరం ఉగాది పండుగ సందర్భంగా అమ్మవారికి శ్రీ విశ్వనాయకి అలంకరణ గావించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఆలయానికి విచ్చేసిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. పెనుమర్తి గౌతమ్‌కుమార్ శర్మ పంచాంగ శ్రవణం కార్యక్రమం నిర్వహించారు. పంచాంగ ఉభయదాతలు చెల్లబాటి శ్రీనివాసరావు, కనకదుర్గ దంపతులు, సనక రఘువంశీ, గాయత్రి దంపతులతో ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత అమ్మవారి ఆలయంలో గణపతి, సరస్వతీ పూజలు నిర్వహించారు. ఈ సంవత్సరం పాడిపంటలతో సస్యశ్యామలంగా ఉంటుందని తెలిపారు. భక్తులకు పంచాంగం పుస్తకాలు, లడ్డుప్రసాదం, అన్నప్రసాద వితరణ చేశారు.


శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానంలో పంచాంగం శ్రవణం చేస్తున్న గౌతమ్‌కుమారుశర్మ

శ్రీజనార్దనస్వామి దేవాలయంలో...

కర్లపాలెం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం ఆగ్రహారంలో ఉన్న శ్రీ జనార్దనస్వామి దేవాలయంలో శ్రీ విశ్వావసు ఉగాది పూజలు నిర్వహించారు. వేదపండితులు పవన్ శర్మ పంచాంగ శ్రవణం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు ఈసందర్భంగా బృందావనం శ్రీనివాసచార్యులు మాట్లాడుతూ శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో మిశ్రమ ఫలితాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో వేదాంతం శ్రీనివాసచార్యులు, భక్తులు పాల్గొన్నారు.


శ్రీ జనార్దనస్వామి దేవాలయంలో పంచాంగ శ్రవణం చేస్తున్న వేద పండితుడు పవన్ శర్మ

చెరుకుపల్లిలో...

చెరుకుపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లిలోని శివాలయంలో 'నాన్న గారు స్వచ్ఛంద సేవా సంస్థ', ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవం, పంచాంగ శ్రవణం నిర్వహించారు. జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ తెలుగు నూతన సంవత్సరంలో అందరికి శుభాలు, పాడిపంటలు కలగాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర బ్రాహ్మణసంఘ కార్యదర్శి రావూరి ఆంజనేయులుని ఉగాది పురస్కారంతో ఘనంగా సత్కరించారు. పంచాంగ శ్రవణం పెనుమత్స గౌతమశర్మ జరిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ధర్మప్రచారక్ జంజనం హేమశంకరరావు, చింతల మురళీకృష్ణ, పడమట వెంకటేశ్వరరావు, ఓగిరాల వీరాస్వామి, ఉల్లంగుంట సాంబశివరావు, ఆలయ అర్చకులు ప్రయాగ రాంబాబు, పొన్నపల్లి సుశీల పాల్గొన్నారు.


రాష్ట్ర బ్రాహ్మణ సంఘ కార్యదర్శి రావూరి ఆంజనేయులుని ఉగాది పురస్కారంతో సత్కరిస్తున్న పొన్నపల్లి సత్యనారాయణ

జిల్లా స్థాయి హాకీ జట్టు ఎంపిక

బాపట్ల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెరువుజమ్ములపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం జిల్లా స్థాయి హాకీ జట్టు ఎంపికను నిర్వహించారు. జూనియర్ మెన్ క్రీడాకారుల జట్టులో మేకా శరత్ చంద్ర, యాజలి శరత్‌బాబు, కటికల సాగర్‌బాబు, గరికపాటి గమానీయేలు, షేక్ సోహేల్, ఎస్‌కే అక్రమ్, మేరుగు సిసింద్రి, నర్రా నరేష్, ముక్కు తేజ సతీష్, బోయన కిరణ్, కొమ్మూరి అకాష్, తైదుల మహేష్‌బాబు, జొన్నలగడ్డ పీటర్‌పాల్, జొన్నలగడ్డ ప్రవీణ్, ఎ.మణికంఠలను ఎన్నుకున్నట్లు హాకీ బాపట్ల కార్యదర్శి బోయన వీరచంద్ర తెలిపారు.

ఎంపికైన జట్టు ఏప్రిల్ 6 నుంచి 9వ తేదీ వరకు ధర్మవరంలో జరిగే జూనియర్ మెన్ రాష్ట్ర స్థాయి హాకీ ఛాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొంటారని అన్నారు.

శ్రీ సొరకాయల అంకమ్మ తల్లికి పూజలు

కర్లపాలెం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలం చింతాయపాలెం తూర్పుపాలెంలో ఉన్న శ్రీ సొరకాయల అంకమ్మ తల్లి ఆలయంలో శ్రీ విశ్వావసు ఉగాదిని పురస్కరించుకొని విశేష పూజలు, జలాభిషేకం, మొక్కుబడులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెదమల్లు రంగారావు, మంగమ్మ భాస్కరావు, మార్కండేయులు, వెంకట్రావు, తన్నీరు సాయి, అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌నగర్‌లో నేత్ర వైద్య శిబిరం


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న చిత్రం

వేమూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : గంగోత్రి వాటర్ ప్లాంటు, కార్తీక్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో వేమూరు అంబేద్కర్‌నగర్ రక్షణ సైన్యం ప్రార్ధనా మందిరం ప్రాంగణంలో ఆదివారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వందకు పైగా ప్రజలు కంటి పరీక్షలు చేయించుకున్నారని, వారికి కావాల్సిన కళ్లజోళ్లు త్వరలోనే అందిస్తామని శిబిరం నిర్వాహకుడు, రాయల్ ఇండస్ట్రీస్ అధినేత పాముల అనీల్ తెలిపారు. ఈ శిబిరంలో కార్తీక్ ఫౌండేషన్ ఛైర్మన్ నండూరి కార్తీక్, దళిత నాయకులు బుస్సా నాగరాజు, అంబేద్కర్‌నగర్ గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిజాంపట్నం ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా మొర్ల

రేపల్లె, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని నిజాంపట్నం మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా మొర్ల శ్రీనివాసరావుని నియమించారు. నిజాంపట్నంలో పని చేసే తహసీల్దార్ శెలవుపై వెళ్ళటంతో రేపల్లె తహసీల్దార్ అయిన మొర్ల శ్రీనివాసరావును ఇన్‌చార్జ్‌గా నియమించినట్లు ఆదివారం ఉత్తర్వులు వెలువడ్డాయి.


తూర్పుసత్రంలో కొత్త రథానికి హారతులిచ్చి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

భావదేవునికి కొత్త రథం

● ప్రారంభించిన ఎమ్మెల్యే వేగేశన

బాపట్ల,మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : చారిత్రక ప్రసిద్దిగాంచిన శ్రీ మత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీసమేత శ్రీ క్షీరభావన్నారాయణస్వామి దేవాలయానికి కోటి 50 లక్షల రూపాయలు వెచ్చించి ఆధునాతనంగా నిర్మించిన రథాన్ని ఆదివారం ఉగాది సందర్భంగా ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ప్రారంభించారు. తూర్పుసత్రంలో తయారు చేసిన రథానికి పూజలు చేసి హారతులిచ్చి శాస్త్రోక్తంగా దేవాలయానికి తీసుకొచ్చారు. పాతరథాన్ని బయట పెట్టి కొత్తరథాన్ని రథశాలలో ఏర్పాటు చేశారు. ఈ ఏడాది రథోత్సవం కొత్తరథంలో కొలువు తీరిన భావదేవునితో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తుల కోర్కెలు తీర్చే భావదేవుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. భావదేవుని చల్లని చూపుతో పాడిపంటలు, సిరిసంపదలతో వర్ధిల్లాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కళ్ళం హరినాధరెడ్డి, విన్నకోట సురేష్, జిట్టా శ్రీనివాసరావు, అల్లం గోపికృష్ణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ, మండపాటి ఆంద్రేయ, కొటికం సుబ్బారావు గురుస్వామి, చేజర్ల సతీష్, పల్లం సరోజనీ, జి.గిరిజారాణి, చెన్నుపాటి హైమావతి, కూచిపూడి ఝాన్సీరాణి, ఆలయ ఈవో డి.వెంకటేశ్వర్లు, ఇన్‌స్పెక్టర్ ఎన్.గోపి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వేగేశన ప్రత్యేక పూజలు

శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత శ్రీ క్షీరభావన్నారాయణస్వామి దేవాలయంలో ఆదివారం పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ నాయకులు ఎం.శేషుకృష్ణ, కిషోర్ పాల్గొన్నారు.

దండి పార్వతీ అమ్మవారి గ్రామోత్సవం

భట్టిప్రోలు (కొల్లూరు), మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : గ్రామ దేవత దండి పార్వతీ అమ్మవారి గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని భట్టిప్రోలులోని దండి పార్వతీ అమ్మవారి గ్రామోత్సవాన్ని గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేక పల్లకీలో ప్రతిష్ఠించి కనక తప్పెట్లు, మేళతాళాలు, బాణాసంచాల నడుమ గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి పూలు, పండ్లు, హారతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘ అధ్యక్షుడు యేమినేని శ్రీనివాసరావు, సభ్యులు ఆరేపల్లి సుబ్బారావు, పాండురంగారావు, మణికంఠ, సాయిబాబా, శంకర్, గౌడ యువత పాల్గొన్నారు.


గ్రామ దేవత దండి పార్వతీ అమ్మవారి గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

రామకోటి మహోత్సవాలు ప్రారంభం

చుండూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మున్నంగివారిపాలెంలో దశాబ్దాల చరిత్ర కలిగిన శ్రీరామ మందిరంలో ఆదివారం నుంచి రామకోటి మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. వచ్చే నెల 6వ తేదీ వరకు ఈ ఉత్సవాలు కొనసాగుతాయని, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు జరిగాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా భగవత్ పారాయణం, సుందరకాండ ప్రవచనం, విష్ణు సహస్రనామ పారాయణం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు, చివరి రోజు స్వామి వారికి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అనంత భోగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకారంతో అనంత భోగేశ్వరస్వామి

కొల్లూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : విశ్వావసు నామ సంవత్సరాది ప్రారంభాన్ని పురస్కరించుకుని గంగా పార్వతీ సమేత అనంత భోగేశ్వరస్వామికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రం కొల్లూరులోని అనంత భోగేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి ఉగాది పర్వదినం సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి విశేష అలంకారం గావించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు ఆర్టీసీ బస్సులు ప్రారంభం

రేపల్లె, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆర్టీసీ డిపోకి రెవెన్యూశాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రత్యేక దృష్టిసారించి పది నూతన ఎక్స్‌ప్రెస్ బస్సులను మంజూరు చేయించారు. సోమవారం వాటిని మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ, కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి సత్యకుమార్‌యాదవ్‌లు ప్రారంభించనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ సుఖవాసి సునీల్‌కుమార్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవలే రేపల్లె ఆర్టీసీ డిపోలో రెండు నూతన ఇంద్ర బస్సులు ప్రారంభించటం జరిగిందని, మరలా పది ఎక్స్‌ప్రెస్ నూతన బస్సులు వచ్చాయన్నారు. ఈ బస్సులను గుంటూరు-విజయవాడ తదితర ప్రాంతాలకు తిప్పనున్నట్లు చెప్పారు. ఈ ప్రారంభోత్సవానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఛైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ నెల్లూరు జోన్ ఎస్.సురేష్‌రెడ్డి, ఆర్టీసీ ఉన్నతాధికారులు పలువురు పాల్గొంటారని తెలిపారు.

స్వచ్ఛ భారత్ కోసం 15 రిక్షాలు

భట్టిప్రోలు (కొల్లూరు), మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ భారత్‌లో భాగంగా పారిశుధ్య పనుల నిర్వహణ కోసం 15 రిక్షాలను ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ దారా రవికిరణ్మయి అన్నారు. పంచాయతీ కార్యాలయం వద్ద నూతనంగా కొనుగోలు చేసిన 15 రిక్షాలను సర్పంచ్ ఆదివారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలో ప్రతి వార్డుకు ఒక రిక్షా చొప్పున కేటాయించి పారిశుధ్య కార్మికులతో వీధులన్నింటిని శుభ్రం చేయిస్తామన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్న ఆలోచనతోనే నూతన రిక్షాలను కొనుగోలు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ కోటా శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ బూరెల రాంప్రసాద్, వార్డు సభ్యులు డి.శ్యాంసుందర్, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.


పారిశుధ్య పనుల కోసం కొనుగోలు చేసిన రిక్షాలను ప్రారంభిస్తున్న సర్పంచ్ కిరణ్మయి

వైభవంగా దాసయ్యస్వామి ఆరాధనోత్సవం

చినగంజాం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దపల్లెపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని తూర్పుపల్లెపాలెం గ్రామంలో దాసయ్యస్వామి 17వ వార్షిక ఆరాధన మహోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆరాధన మహోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని దర్గాలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం పెద్దపల్లెపాలెం గ్రామ కాపు దండప్రోలు తిరుమలరావు ఇంటి వద్ద నుంచి తూర్పుపల్లెపాలెం గ్రామం వరకు దాసయ్యస్వామి వారి జెండా ఊరేగింపు కనక తప్పెట్లు, బాణసంచాలతో, భక్తుల కోలాహలంతో నిర్వహించారు. రాత్రి జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సహాయ సహకారంతో భక్తులకు ఉచితంగా మజ్జిగను పంపిణీ చేసినట్లు టీడీపీ నాయకులు రాములు తెలిపారు. దాసయ్యస్వామి భక్తబృందం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రథమ వార్షికోత్సవం

మేదరమెట్ల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : బొడ్డువానిపాలెంలో శ్రీ అభయాంజనేయ స్వామి ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామికి విశేషాభిషేకాలు, ఆకుపూజలు నిర్వహించారు. భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరిపారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

వలపర్లలో ఆక్రమణలు తొలిగేదెప్పుడు?

» నిత్యం ట్రాఫిక్ సమస్యలు

» ఇబ్బందులు పడుతున్న ప్రజలు



వలపర్లలో ఇరుకుమయంగా రథంబజార్

మార్టూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోనే వలపర్ల గ్రామ పంచాయతీకి ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. మంచి వస్త్ర వ్యాపారానికీ, బంగారు నగల తయారీకి, చేనేత మగ్గాల కుటుంబాలకు నిలయమైన వలపర్ల గ్రామానికి ఎంతో గుర్తింపు ఉంది. దానికి తోడు రాజకీయపరంగా గ్రామపంచాయతీ, అసెంబ్లీ ఎన్నికలలో వలపర్ల గ్రామం వైపు అన్ని రాజకీయ పార్టీనాయకులు ప్రత్యేక దృష్టి పెడుతుంటారు. గ్రామంలోని ఓటర్లు సుమారు 9 వేలు కాగా, జనాభా మాత్రం 12 నుంచి 15 వేల వరకు ఉంటారు. అయితే ఇన్ని ప్రత్యేకతలు ఉన్న వలపర్ల గ్రామంలో ఎంతో కాలం నుంచి ప్రధాన సెంటరు పూర్తిగా ఆక్రమణలకు గురైంది. ముఖ్యంగా ప్రధాన సెంటర్‌లో ఎన్‌టీఆర్ బొమ్మ నుంచి స్టేట్‌బ్యాంక్ ముందుగా సినిమా హాలు సెంటరు వరకు రోడ్డుకు ఇరువైపులా కొన్నిచోట్ల పంచాయతీకి చెందిన స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయి. ఇక గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ బొమ్మ వరకు వచ్చే రోడ్డులో రథం బజారు రద్దీలో హైదరాబాదులోని చార్మినార్ సెంటర్‌ను తలపిస్తుంటుంది. రోడ్డుకు ఇరువైపులా దుకాణాలతో ఇరుకుగా తయారైంది. ఒక వాహనం రథం బజారులోకి అడుగుపెడితే రెండో వాహనం వెళ్లాలంటే కష్టమే. అద్దంకి నుంచి చిలకలూరిపేట వైపు, చిలకలూరిపేటనుండి అద్దంకి వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు ట్రాఫిక్‌తో పాటు ఆక్రమణలు పుణ్యాన ప్రధాన సెంటర్‌లో టర్నింగ్ తీసుకోవడానికి డ్రైవర్లు నానా ఇబ్బందులు పడుతుంటారు.ఈ సెంటరులో సెంటు స్థలం ధర ఆకాశంలో ఉంటుంది. అందుకని ఆక్రమణలకు గురైన స్థలాలను వదులుకోవడానికి ఆక్రమణదారులు ఇష్టపడరు.

ఆక్రమణలను తొలగించాలంటే పిల్లిమెడలో గంట కట్టేదెవరు

వలపర్ల సెంటర్‌లో పెరిగిన ఆక్రమణలు కారణంగా ప్రజలు, వాహనదారులు, వ్యాపారులు, దాదాపుగా అందరూ ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గ్రామస్థులు అందరూ అంగీకరిస్తారు. అదేవిధంగా ఆక్రమణలను తొలగించాలని కోరుకుంటారు గ్రామ పార్టీనాయకులు కూడా ఆక్రమణలను తొలగించాలని పై స్థాయి ఉన్నత నాయకులకు చెప్తుంటారు. కానీ పిల్లి మెడలో గంట కట్టేదెవరు? వలపర్ల సెంటర్‌లో ఆక్రమణలను తొలగించడానికి పూనుకునేదెవరు అనే ప్రశ్న అందరి మదిలో మొదులుతూనే ఉంది. ఈ ఆక్రమణలు తొలగింపు అనే కందిరీగ తుట్టెను కదిపితే తమ పార్టీ ఓట్లు బ్యాంక్‌కు తూట్లు పడతాయని రాజకీయ పార్టీనాయకులు కూడా సైలెంట్‌గా ఉంటున్నారు. సాఫీగా జరుగుతున్న వలపర్ల గ్రామంలో తొలగింపు ఆక్రమణలు అలజడికి మేమెందుకు కారణమవ్వాలని నాయకులు కూడా చూస్తూ ఉన్నారు. గత కొన్నేళ్ల నుంచి గ్రామంలో ఇదే పరిస్థితి నెలకొనిఉంది. ఏళ్ల తరబడి గ్రామ పంచాయతీ సర్పంచ్‌లుగా ఎవరు అధికారంలోకి వచ్చినా, పంచాయతీ అధికారులుగా ఎవరు ఉన్నా అక్రమణల తొలగింపుపై సాహసం చేయలేకపోయారు. కానీ ఎప్పటికైనా సెంటర్‌లో ఆక్రమణలను తొలగించాల్సిన పరిస్థితి ఉంది. మరి ఈ విషయమై గ్రామంలోని ఇరుపార్టీల నాయకులనుగానీ, గ్రామ పెద్దలుగానీ, ప్రజా ప్రతినిధులనుగాని కదిపితే మాత్రం పిల్లి మెడలో గంట కట్టేదెవరంటూ గుంభనంగా నవ్వుతూ వెళ్లిపోతారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

43 మందికి సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ప్రతి కుటుంబ ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతో టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఆదివారం మండలంలోని ఇసుకదర్శి ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 43 మందికి మంజూరైన రూ.22 లక్షల 82వేల304 సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు బాధితులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ 9 నెలలు కాలంలో నియోజకవర్గంలో 320 మందికి సుమారు 3 న్నర కోట్లకు పైగా రూపాయలను సీఎం సహాయనిధి నుంచి బాధతుల వైద్య ఖర్చుల కోసం పంపిణీ చేశామన్నారు. పేద కుటుంబాలు అనారోగ్యానికి గురైనప్పుడు వైద్యం కోసం వారు అప్పులు చేసి ఇబ్బందులు పడుతున్నారని, వారిని ఆదుకోవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు సీఎం సహాయనిధి ద్వారా సాయం అందిస్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. పేద ప్రజల ఆరోగ్యం కోసం నిధులు మంజూరు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో పేదలకు అందించే వైద్య సేవలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారన్నారు. మార్టూరు, పర్చూరు ప్రభుత్వ ఆస్పత్రులలో ఓపీల సంఖ్య పెరుగుతుందంటే అందుకు కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యం పట్ల తీసుకుంటున్న చర్యలేనన్నారు. కార్యక్రమంలో తాటి నాగేశ్వరరావు, అడుసుమల్లి శ్రీనివాసరావు, కోటపాటి సురేష్, నాయుడు హనుమంతరావు, కంభంపాటి హనుమంతరావు పాల్గొన్నారు.

స్థల వివాదంలో కానిస్టేబుల్‌పై కత్తితో దాడి

గవినివారిపాలెం(చీరాల), మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : స్థలం వివాదంలో సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌పై పలువురు తీవ్రంగా కత్తితో దాడిచేసి గాయ పరిచారు. ఈ ఘటన ఆదివారం మండల పరిధిలోని గవినివారిపాలెంలో చోటుచేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ చీదరబోయిన నాగేశ్వరరావుకు, చీదరబోయిన భరత్, వీరయ్య, లక్ష్మీనారాయణకు మధ్య స్థల వివాదాలు ఉన్నాయి. నాగేశ్వరరావు నాయనమ్మ రాములమ్మ తన స్థలంలో ఇంటి నిర్మాణం నిమిత్తం బేస్‌మట్టం చేయించుకుంటుంది. దీనికి సంబంధించి హద్దు విషయంలో రాములమ్మతో ముగ్గురు వాదనకు దిగారు. విషయం తెలుసుకుని చేరుకున్న కానిస్టేబుల్ నాగేశ్వరరావు వారిని నిలదీశారు. దీంతో వివాదం జరిగి ముగ్గురితో పాటు మరి కొందరు కలిసి కత్తితో దాడి చేయగా నాగేశ్వరరావు శరీరంపై గాయాలయ్యాయి. అతడిని ఏరియా వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు. రూరల్ సీఐ శేషగిరిరావు, ఎస్సై చంద్రశేఖర్ హాస్పిటల్‌కు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేశారు.

బస్టాండ్‌లో చలివేంద్రం ప్రారంభం

ఇంకొల్లు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు బస్టాండ్‌లో విశ్వ హిందూ పరిషత్ వారు ఆదివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఎండలను దృష్టిలో పెట్టుకొని ప్రయాణికుల సౌకర్యార్థం మే ఆఖరు వరకూ మంచినీరు, మజ్జిగను అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రామూర్తి, బ్రహ్మం, రమేష్, హనుమంతరావు, శ్రీను, ప్రభావతి, అనంతరామయ్య, సుబ్బారావు, మోహనకృష్ణ పాల్గొన్నారు.

బైకు ఢీకొని వ్యక్తికి గాయాలు

అద్దంకి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు పక్కన నడిచి వెళ్తున్న ఇటుక బట్టీ కార్మికుడిని మోటార్ సైకిల్ ఢీకొనడంతో తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికుల కథనం మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన కూలీలు అద్దంకి సమీపంలోని కలవకూరు రోడ్డులో ఇటుక బట్టీలలో పనిచేస్తున్నారు. ఆదివారం కలవకూరు రోడ్డులో ఇటుక బట్టీల వద్ద రోడ్డు మార్జిన్‌లో నలుగురు కూలీలు నడిచి వెళ్తుండగా ఎస్.ఎర్రయ్యను అద్దంకి నుంచి కలవకూరు వైపు వెళ్తున్న మోటార్‌సైకిల్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఎర్రయ్యను 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

జడ్పీటీసీని పరామర్శించిన బూచేపల్లి

కారంచేడు (పర్చూరు), మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు జడ్పీటీసీ సభ్యురాలు యార్లగడ్డ రజని అనారోగ్యానికి గురికావడంతో ఆదివారం ప్రకాశం జిల్లా జడ్పీ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఆమె కుమారుడు దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ పరామర్శించారు. రజని ఇంటికి వెళ్లిన వారు ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారివెంట వైసీపీ ఇన్‌చార్జి గాదే మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

క్రైస్తవుల నిరసన ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న క్రిస్టియన్లు

చీరాల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ సువార్తికులు పగడాల ప్రవీణ్ మృతికి సంబంధించి పట్టణంలో క్రైస్తవులు పెద్ద ఎత్తున నిరసన క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. సెయింట్ మార్క్స్ లూథరన్ చర్చి నుంచి ప్రారంభమైన ర్యాలీ గడియార స్తంభానికి చేరుకుని మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో మత బోధకులు, క్రైస్తవులు, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పర్చూరు : పాస్టర్ పగడాల మృతిపై పారదర్శకంగా విచారణ జరగాలని పలువురు పాస్టర్స్ డిమాండ్ చేశారు. సెయింట్ థారస్ లూథరన్ పరిశుద్ధ చర్చి ఆధ్వర్యంలోని ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు.



సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఉగాది పురస్కారాన్ని అందుకుంటున్న అద్దంకి శ్రీరామచంద్రమూర్తి, చీరాల సాహితీ వేత్త రాధాకృష్ణ

పుట్టంరాజుకు ఉగాది పురస్కారం

అద్దంకిటౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ప్రభుత్వం వివిధ రంగాలలలో ప్రతిభ చూపిన పలువురికి ఉగాది పండుగ సందర్భంగా పురస్కారాలను అందించింది. ఆదివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన వేడుకలలో అద్దంకికి చెందిన విశ్రాంత హెచ్‌ఎం, సాహితీవేత్త పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తికి ఉగాది పురస్కారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు అందజేశారు. కార్యక్రమంలో టూరిజం మంత్రి కందుల దుర్గేష్, దేవదాయశాఖ మంత్రి ఆనం రామానారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పురస్కారాన్ని అందుకున్న పుట్టంరాజుకు అద్దంకికి చెందిన సాహితీ వేత్త వారణాసి రఘురామశర్మ, ఈఈ మస్తాన్‌రావు, బీవీ కృష్ణారెడ్డి, చిన్ని మురళీకృష్ణ, గాడేపల్లి దివాకర్‌దత్తు, చప్పిడి వీరయ్య, పోలిరెడ్డితో పాటు సాహితీ ప్రముఖులు పుట్టంరాజును అభినందనలు తెలియజేశారు.

రాధాకృష్ణకు అవార్డు

చీరాల : చీరాలకు చెందిన ప్రముఖ సాహితీవేత్త వడలి రాధాకృష్ణ ఆదివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన అభినందన సభలో సాహితీ పురస్కారాన్ని అందుకున్నారు. స్థానిక ప్రముఖులు వడలి సాహితీ రంగానికి అందిస్తున్న సేవలను కొనియాడారు.

శింగరకొండ పూజారికి ..

అద్దంకి : ఉగాది పండుగను పురస్కరించుకొని జిల్లా స్థాయిలో బాపట్లలో దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉగాది పురస్కార ప్రదానోత్సవంలో శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయ పూజారి శ్రీరామచంద్రమూర్తి కలెక్టర్ వెంకటమురళి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. అనంతరం శింగరకొండలో శ్రీరామచంద్రమూర్తిని ఈవో తిమ్మానాయుడు, పూజారులు అభినందించారు.

అదనపు లోడు క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ

బల్లికురవ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగ దారులందరూ అదనపు లోడు క్రమబద్ధీకరణకు 50శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలని బల్లికురవ మండల విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావు పేర్కొన్నారు. కిలో వాట్ లోడుకు రెండు వేలు చెల్లించాల్సి ఉందని ఇప్పుడు రాయితీ ప్రకారం రూ.1000 చెల్లిస్తే సరిపోతుందని వినియోగదారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. జూన్ వరకు గడువు ఉందని పాత విద్యుత్ కనెక్షన్లు వాడుకుంటున్న వారు వెంటనే అదనపు లోడుకు రాయితీ నగదు చెల్లించాలని అయన కోరారు. మరిన్ని వివరాలకు గ్రామాలలో ఉన్న విద్యుత్ సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

శాకాహారంతో ఆరోగ్యం

చీరాల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి సిద్ధంగా లభించే శాకాహారంతో అందరూ ఆరోగ్యంగా జీవించాలని జన విజ్ఞాన వేదిక చీరాల డివిజన్ ప్రతినిధులు అన్నారు. ఉగాది పండుగను పురస్కరించుకుని కేజీఎం ఉన్నత పాఠశాలలో జేవీవీ ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ఉగాది పచ్చడి విలువను తెలియజేశారు. కవులు శాస్త్రీయ పద్ధతులు, జీవన మనుగడ అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం కవులు చిరంజీవి, వెంకట్, కృష్ణమోహన్‌ను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు భాస్కరరావు, నిర్వాహకులు రామారావు, జయరాజ్, శ్రీను, వెంకటేశ్వర్లు, హేమంత్, సూరిబాబు, వెలుగొండారెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి రూ.7.72కోట్లు మంజూరు

అద్దంకి,మార్చి30(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత గ్రామీణ రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తూ నిధులు మంజూరు చేస్తుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలకు తారు రోడ్ల నిర్మాణానికి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా 7.72 కోట్ల రూపాయల నిధులు మంజూరైనట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. తిమ్మనపాలెం నుంచి ఎర్రబాలెంకు 1.20 కోట్ల రూపాయలు, బండివారిపాలెం నుంచి మిన్నెకల్లు కు 3 కోట్ల రూపాయలు, సంతమాగులూరు నుండి నె హ్రూ నగర్ కు 1.50 కోట్ల రూపాయలు, జాతీయ రహదారి నుండి పి.గుడిపాడుకు 80 లక్షలు, జాతీయ రహదారి నుంచి కుర్రావానిపాలెంకు 17 లక్షల రూపాయలు, ముప్పవరం నుంచి కొండమూరు 45 లక్షల రూపాయలు, పి.గుడిపాడు నుంచి అలవలపాడుకు రూ.60లక్షలు మంజూరైనట్లు తెలిపారు.

ముస్లింలకు మంత్రి గొట్టిపాటి రంజాన్ శుభాకాంక్షలు

ముస్లింలకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ అందరి జీవితాలలో సుఖసంతోషాలు తీసుకురావాలన్నారు. రంజాన్ త్యాగానికి, సేవానిరతికి మారుపేరన్నారు. అల్లాహో ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

నేడు విద్యుత్ బిల్లుల చెల్లింపునకు అవకాశం

అద్దంకి, మార్చి30 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారులు బిల్లులు చెల్లించేందుకు వీలుగా అద్దంకి విద్యుత్ డివిజన్ పరిధిలోని అన్ని విద్యుత్ చెల్లింపు కేంద్రాలు సోమవారం తెరిచి ఉంటాయని ఈఈ నల్లూరి మస్తాన్‌రావు ఆదివారం ప్రకటనలో తెలిపారు.

ఘనంగా ఉగాది వేడుకలు



పొదుపు సంఘాల మహిళలకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య



పంచాంగ శ్రవణం చేస్తున్న ప్రముఖ వేద పండితులు మాచిరాజు

చీరాల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గం పరిధిలో ఆదివారం ఉగాది పర్వదినం వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన పంచాంగ శ్రవణంలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పాల్గొన్నారు. అందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ రుణ సాయంతో అభివృద్ధి

ఆర్థిక భరోసా కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రుణ సాయంతో అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. పీఎంఎఫ్‌ఎంఈ ద్వారా మంజూరైన రూ.13లక్షల చెక్కులను రుణ గ్రహీతలకు అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ఈపథకం ద్వారా ఉపాధి కోసం రూ.లక్ష నుంచి రూ.50 లక్షల వరకు బ్యాంకులు సాయం అందిస్తున్నట్లు వివరించారు. అవకాశాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎంలు మధు, అంజిబాబు, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

అద్దంకి : తెలుగు సంవత్సరాది ఉగాదిని ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇళ్లల్లో ప్రత్యేక పూజలు చేసుకొని దేవాలయాలకు వెళ్లి స్వామి వార్లను దర్శించుకున్నారు. శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి, లక్ష్మీనరసింహస్వామి దేవాలయాలలో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయాల్లో విశ్వావసు నామ సంవత్సర పంచాంగ శ్రవణం విన్పించారు. ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో చీరాల ప్రిన్సిపల్ జూనియర్ న్యాయాధికారి రిహానా కుటుంబసభ్యులతో పూజలు నిర్వహించారు. ప్రకాశం జిల్లా డ్వామా పీడీ జోసఫ్ కుమార్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వార్లను దర్శించుకున్నారు. జానపద కళాపీఠం ఆధ్వర్యంలో జనశిక్షణ సంస్థ డైరెక్టర్ శ్యాంసునీల్‌కు ఉగాది పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఆర్జేడీ డాక్టర్ దేవపాలన, జ్యోతిచంద్రమౌళి పాల్గొన్నారు.

చినగంజాం : తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలను అన్ని గ్రామాల్లో ఆదివారం ఘనం గా నిర్వహించారు. విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. షడ్రుచుల సమ్మేళిత ఉగాది పచ్చడిని భక్తులకు పంపిణీ చేశారు. పంచాగ శ్రవణాన్ని వేద పండితులు చదవి వినిపించారు. ఒకరినొకరు తెలుగు సంవత్సరాది శుభాకాంక్షలు తెలుపుకున్నారు. భూ సమేత భావనారాయణస్వామి ఆలయంలో ఉగాది పండుగను పురస్కరించుకుని అలయ అర్చకులు ఏఎల్ లక్ష్మీనరసింహాచార్యులు, యాజ్ఞిక స్వాములు పరాశరం రామాచార్యుల ఆధ్వర్యంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు శత అష్టోత్తర కలశ స్థాపన తిరువంజనం కార్యక్రమాన్ని నిర్వహించి, 108 కలిశాలతో స్వామికి అభిషేకాలు, విశేష పూజలు జరిపారు. రాత్రికి స్వామి వారిని విశేషంగా అలంకరించి ఊంజల్ సేవ జరిపారు. తదనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను వినియోగం చేశారు. మండలంలోని సంతరావూరు, చినగంజాం, గొనసపూడి, కడవకుదురు, రాజుబంగారుపాలెం, చింతగుంపల్లి, పెదగంజాం, నీలాయిపాలెం తదితర గ్రామాల్లోని దేవాలయాల్లో పంచాగ శ్రవణం నిర్వహించారు.

పర్చూరు : ఉగాది పండుగను ఉత్సాహంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రీ తివిక్రమ అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శ్రీకంచి బొట్ల శ్రీనివాసశర్మ నేతృత్వంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి నాగయ్య ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణ కార్యక్రం జరిగింది.

మార్టూరు : ఉగాది పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఇళ్లకు మామిడితోరణాలు కట్టుకొని, పూజలు చేశారు. ఘట్టేశ్వరస్వామి, పాండురంగస్వామి, ఆంజనేయస్వామి తదితర దేవస్థానాలకు వెళ్లి స్వామిని దర్శించుకున్నారు.

ఆకట్టుకున్న మాచిరాజు పంచాంగ శ్రవణం

పంగులూరు : చందలూరు గ్రామంలో ఆదివారం ఉగాది పర్వదిన సందర్భంగా పంచాగ శ్రవణం జరిగింది. గ్రామంలోని శ్రీ చెన్నకేశవస్వామి వారి ఆలయ ప్రాంగణంలో ప్రముఖ వేదపండితులు మాచిరాజు వేణుగోపాల్ పంచాంగ శ్రవణం గావించారు. పంచాంగ శ్రవణం భవిష్యత్ ద్వారాన్ని ఆవిష్కరిస్తుందని, విశ్వావసు సంవత్సరంలో గతం కంటే అందరికీ మెరుగైన ఫలితాలు ఉంటాయని మాచిరాజు తెలిపారు. మీన రాశి వారికి కొంత ఇబ్బందికరం ఉంటుందన్నారు. గతం కంటే పంటలు ఆశాజనకంగా ఉంటాయని, దిగుబడులు, ధరలు అనుకూలిస్తాయన్నారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డ్ మాజీ చైర్మన్ పల్లపోతు శ్యాంసుందరం, ఈవో అంజనీదేవి, అర్చకులు రఘునాథాచార్యులు, గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.

అద్దంకి మేజర్‌లో పూడికతీత పనులు ప్రారంభం

అద్దంకి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : సాగర్ ఆయకట్టులోని అద్దంకి మేజర్ కాలువలో రూ.20లక్షలతో చేపడుతున్న పూడిక తీత పనులను డీఈ రామకృష్ణ ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీ అధ్యక్షుడు బండారుపల్లి శ్రీనివాసరావు, ఏఈ సునిల్ పాల్గొన్నారు.

అన్నదానం

అద్దంకి, మార్చి30 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి ఆధ్వర్యంలో ఆదివారం మున్సిపల్ వైస్ చైర్మన్ దేసు పద్మేష్ సహకారంతో అన్నదానం పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద నిర్వహించారు. మున్సిపల్ మేనేజర్ శ్రీదేవి, లహరి, సుధీర్, వీరయ్య, శ్రీనివాసరావు, తిరుపతిరెడ్డి గురుస్వామి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఏలూరిని కలిసిన ఉప్పురైతులు

మార్టూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : చినగంజాం మండలానికి చెందిన ఉప్పు రైతులు ఆదివారం మండలంలోని ఇసుకదర్శి ఎమ్మెల్యే ఏలూరి క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును కలిశారు. మండలంలో ఉప్పును సాగుచేస్తూ ఏళ్ల తరబడి ఉప్పునే జీవనాధారంగా చేసుకొని బతుకుతున్న దాదాపుగా 25 మందికి పైగా రైతులు ఏలూరిని కలిశారు. సమస్యలను ఏలూరి దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ పరంగా, తన పరంగా కృషి చేస్తానని ఏలూరి ఉప్పు రైతులకు భరోసా నిచ్చారు.

సీతారాముల పంచలోహ విగ్రహాల బహూకరణ



ఆలయానికి సమర్పించిన స్వామివార్ల పంచలోహ విగ్రహాలు

పర్చూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : శ్రీ అభయాంజనేయస్వామివార్ల దేవాలయంలో శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామివార్ల పంచలోహ విగ్రహాలను ఆదివారం బహూకరించారు. తిమ్మరాజుపాలెంకు చెందిన నర్రా రామయ్య, శిరీష దంపతుల స్వామివార్ల పంచలోహ విగ్రహాలకు పూజలు చేశారు.

రామాలయానికి కొత్తసొబగులు

» ఇత్తడిలోహంతో దర్వాజా, అశ్వవాహనం ఏర్పాటు



గర్భగుడికి ఇత్తడి దర్వాజాతో అలంకరణ, కొలువుదీరిన ఇత్తడి అశ్వవాహనం

మార్టూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఉగాది పండుగను పురస్కరించుకొని ఆదివారం మండలంలోని కోదండరామ స్వామి దేవస్థానంలో కొత్తసొబగులతో భక్తులను అలరించింది. 36 ఏళ్లుగా ఈ దేవస్థానంలో శ్రీరామనవమి పండుగ సందర్భంగా స్వామి వారి కల్యాణం, ఉగాదికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. తాజాగా పలువురు దాతల సహకారంతో ఆలయంలో ప్రత్యేకంగా అలంకరణ చేశారు. గర్భగుడి ముఖద్వారం దర్వాజాను సుందరంగా ఇత్తడి లోహంతో అలంకరణ చేశారు. అంతేగాకుండా ఆలయంలో స్వామి వారి కోసం ఇత్తడి లోహంతో ఏర్పాటు చేసిన అశ్వ వాహనం, సీతారామలక్ష్మణ విగ్రహాలకు మకరతోరణం, ఇంకా ఛత్రంను ఏర్పాటు చేశారు. ఉగాది పండుగ సందర్భంగా అర్చకులు నమశివాయ ఆధ్వర్యంలో పూజలు చేశారు.

నేడు రంజాన్

వేటపాలెం(చీరాల), మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర రం జాన్ వేడుకలు ఆదివా రం రాత్రి నుంచి ఉత్సాహంగా మొదల య్యాయి. సాయంత్రం సూర్యాస్తమయం అనంతరం షవ్వాల్ నెల ప్రా రం భమైంది. సోమవారం ఉదయం మసీదుల వద్ద ప్రార్థనలు నిర్వహించనున్నారు.